

# నేటినిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శనివారం 15-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 238 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## రాష్ట్ర ప్రభుత్వానికి నాట్కో ఫార్మా విరాళం



హైదరాబాద్ , మే 14: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నాట్కో ఫార్మా భారీ విరాళం ఇచ్చింది. కరోనా నియంత్రణకు ఉపయోగించే బారిసిటినిబ్ మాత్రలను విరాళంగా ఇచ్చింది. ఒక లక్ష మంది కరోనా రోగులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ మాత్రలను అందివ్వనున్నారు. ఈ మాత్రల విలువ రూ. 4.2 కోట్లు. ఈ మేరకు సంబంధిత పత్రాన్ని నాట్కో సీఈవో రాజీవ్ నన్నపనేని మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాట్కో సంస్థకు మంత్రి కేటీఆర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## టైమ్స్ గ్రూపు చైర్‌పర్సన్ ఇందూ జైన్ కన్నుమూత



న్యూఢిల్లీ, మే 14: టైమ్స్ గ్రూపు చైర్మన్ ఇందూ జైన్ కన్నుమూశారు. కోవిడ్ సంబంధిత రుగ్మతలతో ఆమె మరణించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఆమె వయసు 84 ఏళ్లు. ఇందూ జైన్ దార్శనికురాలు అని టైమ్స్‌నౌ టీవీ ఛానల్ యాజమాన్యం కొనియాడింది. ఆధ్యాత్మికతతో జీవించారని, దానధర్మాలు చేశారని, కళలను అమితంగా ఇష్టపడేవారని, మహిళల హక్కుల కోసం పోరాడినట్లు టైమ్స్ నౌ పేర్కొన్నది. ఢిల్లీలో ఆమె తుదిశ్వాస విడిచినట్లు వర్గాలు తెలిపాయి. ఇందూ జైన్ మృతి పట్ల రాజకీయవేత్తలతో పాటు ప్రముఖులు సంతాపం తెలిపారు. 1999లో ఆమె టైమ్స్ గ్రూపునకు చైర్మన్ అయ్యారు. భిన్నమైన నాయకత్వ లక్షణాలతో ఆమె ఆకట్టుకున్నారు. టైమ్స్ గ్రూపు అభివృద్ధికి ఆమె ఎంతో దోహదం చేశారు. ద టైమ్స్ ఫౌండేషన్‌ను ఆమె 2000 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. తుఫాన్లు, భూకంపాలు, వరదలు, మహమ్మారులు, ఇతర సంక్షోభ సమయాల్లో టైమ్స్ రిలీఫ్ ఫండ్‌తో ఆమె ఆదుకున్నారు. 2016లో ఆమెకు పద్మ విభూషన్ అందజేశారు. తన అవయవాలు దానం చేయాలన్నది ఆమె జీవితాశయం. కానీ కోవిడ్ లక్షణాలతో మరణించడం వల్ల ఆమె కోరిక తీరలేదు. 2000 సంవత్సరంలో యూఎన్ ఆధ్వర్యంలో జరిగిన మిలీనియం వరల్డ్ పీస్ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఇందూ జైన్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

## ముంచుకొస్తున్న తౌక్తా తుఫాన్.. ఐదు రాష్ట్రాలపై ప్రభావం..!



న్యూఢిల్లీ, మే 14: అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి తీరం వైపు దూసుకొస్తున్నదని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ తుఫాన్ తీర ప్రాంత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రలపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉన్నదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆ ఐదు రాష్ట్రాలకు సహాయక చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం ఔఆఖీఈ బలగాలను పంపించింది.

ఔఆఖీఈకు చెందిన 53 బృందాలను ఐదు రాష్ట్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు ఔఆఖీఈ డీజీ సత్యప్రధాన్ ట్వీట్ చేశారు. తౌక్తా తుపాన్ ప్రభావంతో మే 16 నుంచి భారీ వర్షాలు కురువనున్నాయని ఐఎండీ అధికారులు చెప్పారు. తుఫాన్‌వల్ల మే 15న గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. మే 16న గంటకు గాలి వేగం 80 కిలోమీటర్లకు పెరుగవచ్చని వారు అంచనా వేశారు.

## పంజాబ్‌లో కొత్త జిల్లా.. 23వ జిల్లాగా అవతరణ

అమృత్‌సర్, మే 14: : పంజాబ్‌లో కొత్త జిల్లా ఏర్పాటయ్యింది. ముస్లిం జనాభా అధికంగా ఉన్న మాలేర్‌కోట్లను కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తున్నట్లు పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ ప్రకటించారు. మాలేర్‌కోట్ల ప్రజలు ఎన్నో ఏండ్లుగా తమకు ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారని, ఇన్నాళ్లకు రంజాన్ కానుకగా వారి డిమాండ్ నెరవేరిందని సీఎం పేర్కొన్నారు.

ఇప్పటివరకు మాలేర్‌కోట్లు సంగ్రూర్ జిల్లాలో భాగంగా ఉండేదని, ఈ క్షణం అది ప్రత్యేక జిల్లాగా అవతరించిందని అమరీందర్‌సింగ్ చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పంజాబ్‌లో 13 జిల్లాలు ఉండేవని, నిన్నటి వరకు ఆ సంఖ్య 22 గా ఉన్నదని సీఎం తెలిపారు. తాజాగా మాలేర్‌కోట్ల 23వ జిల్లాగా అవతరించిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తాను కొత్త జిల్లాను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

## హైదరాబాద్ ఎల్బీ నగర్‌లో భారీ వర్షం



హైదరాబాద్ , మే 14: హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో భారీ వర్షం కురుస్తోంది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎల్బీనగర్‌తో పాటు నగరమంతా వాన కురుస్తోంది. ఉదయం నుంచి ఎండ బాగానే ఉన్నప్పటికీ, మధ్యాహ్నం సమయానికి కాస్త వాతావరణం మారిపోయింది. లింగంపల్లి, చందానగర్, మియాపూర్, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలితో పాటు పలు ప్రాంతాల్లో వర్షం పడుతోంది. భారీ ఈదురుగాలులు వీస్తుండటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి.

## నేపాల్ ప్రధానిగా ఓలీ మళ్లీ ప్రమాణ స్వీకారం

కాఠ్‌మాండూమే 14: హిమాలయ దేశమైన నేపాల్ ప్రధానిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలీ(69) శుక్రవారం మళ్లీ ప్రమాణ స్వీకారం చేశారు. గత సోమవారం పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయిన కేపీ శర్మకే రాష్ట్రపతి మరోసారి అవకాశం ఇచ్చారు. 275 మంది సభ్యులున్న సభలో 4 సభ్యులు సస్పెన్షన్‌లో ఉన్నారు. ప్రస్తుతం 271 స్థానాలు ఉన్న పార్లమెంట్‌లో ఓలీ సారథ్యంలోని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీకి 121 మంది సభ్యుల బలం ఉంది. విశ్వాస పరీక్షలో ఓలీ ఓడిపోయిన తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విపక్షాలు విఫలమయ్యాయి. దీంతో దేశాధ్యక్షురాలు విద్యాదేవి భండారీ అతిపెద్ద పార్టీ అధినేతగా ఉన్న ఓలీ కి మళ్లీ సర్కార్ ఏర్పాటు చేసే అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించింది. అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయిన ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలీ శుక్రవారం మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఓలీ 30 రోజుల్లో ప్రతినిధుల సభలో బల పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంది.

## ఇతర రాష్ట్రాలకు చెందిన వారు బెడ్ రిజర్వ్ చేసుకున్నాకే రావాలి : డీహెచ్

హైదరాబాద్ , మే 14: ఇతర రాష్ట్రాలకు చెందిన కొవిడ్ బాధితులు చికిత్సకోసం హైదరాబాద్‌కు రావాలంటే ముందస్తుగా దవాఖానలో బెడ్ రిజర్వ్ చేసుకున్నాకే బయల్దేరాలని తెలంగాణ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ రావు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అంబులెన్స్‌లను అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదని అన్నారు. నిన్నరాత్రి నుంచి ఇప్పటివరకు ఏడుగురు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని అనుమతించామని తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని బట్టి వెంటనే అనుమతిస్తున్నామని అన్నారు. ఇతర రాష్ట్రాల బాధితులెవరైనా నిబంధనల మేరకు తెలంగాణలో వైద్యం చేయించుకోవచ్చని అన్నారు. ఇప్పటికే వేలాది మంది ఇతర రాష్ట్రాల రోగులకు వైద్యం అందించామని ఆయన తెలిపారు. 45 శాతం పడకల్లో ఇతర రాష్ట్రాల రోగులకు చికిత్స అందతున్నదని గుర్తుచేశారు. . "ఇతర రాష్ట్రాల ప్రజలకు వైద్యం చేయమని మేం చెప్పలేదు. ఏ రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టుకోవా లని మేం అనుకోవడం లేదు. ఇతర రాష్ట్రాల రోగుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో ఆక్సిజన్ ఆడిట్ విధానం పెట్టాం. ఆన్‌లైన్‌లో పడకల వివరాలను తెలియజేస్తూ డ్యాష్‌బోర్డు పని చేస్తున్నది. బాధితులు నేరుగా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాల్సిన అవసరం లేదు. దవాఖానలే వైద్య ఆరోగ్యశాఖకు వివరాలు అందిస్తాయి. దవాఖాన వారే ఆరోగ్యశాఖకు వివరాలు అందిస్తాయి. దవాఖానకు పంపిన వివరాలను పరిశీలించి అనుమతులు స్తాం. ఏపీ, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన బాధితులు చికిత్సకోసం హైదరాబాద్‌కు వస్తున్నారు. వీరందరికీ నిబంధనల మేరకు చికిత్స అందిస్తాం" అని ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాస్ తెలిపారు.

## 5 నెలల చిన్నారిని కబళించిన కరోనా

న్యూఢిల్లీ, మే 14: కరోనా మహమ్మారి ఐదు నెలల చిన్నారిని కబళించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. దీంతో ఆ పాప కుటుంబం కన్నీరుమున్నీరవుతున్నది. పరికి బాగా జ్వరంగా ఉండటంతో తల్లిదండ్రులు తొలుత దిల్షాద్ గార్డెన్‌లోని పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం చాచా నెహ్రూ పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆ పాపకు కరోనా సోకినట్లుగా నిర్ధారణ అయ్యిందని పరి తండ్రి తెలిపారు. దీంతో జీబీటీ ఆసుపత్రికి రిఫర్ చేశారని, అక్కడ మే 6 నుంచి వెంటిలేటర్‌పై ఉన్న తమ చిన్నారి ఈ నెల 12న చనిపోయిందన్నారు. పాప మృతదేహాన్ని సీమాపురి శ్మశానవాటికలో దహనం చేసినట్లు పరి తండ్రి వెల్లడించారు.

## దార్శనికుడు బసవేశ్వరుడు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్ మే 14: బహుజన వర్గాలను రాజ్యాధికారానికి చేరువ చేసిన మొట్టమొదటి దార్శనికుడు శరణ బసవేశ్వరడని మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బసవ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఉన్న శరణ బసవేశ్వరుడి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాటి సమాజంలో పేరుకుపోయిన కుల వ్యవస్థను నిర్మూలించడానికి మనుషులందరూ ఈశ్వరుడి దృష్టిలో సమానమేనని వీరశైవ లింగాయత్ ధర్మాన్ని స్థాపించాడు. సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేయడమే కాకుండా కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఎంతో శ్రమించినట్లు మంత్రి తెలిపారు.

నిమ్న వర్గాలు రాజ్యాధికారానికి అనర్హులనే జడత్వ భావన నాటి సమాజంలో రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో శరణు బసవేశ్వరుడు ఒక రాజ్యాధినేతగా తన మంత్రివర్గంలో అనుభవ మంటపం పేరుతో అన్ని కులాల వారికి స్థానం కల్పించి శతాబ్దాల కిందటే సమసమాజ స్థాపన కోసం కృషి చేశారన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ శరణు బసవేశ్వరుడి ఆశయ సాధన కోసం కంకణబద్ధులై ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ నాయకులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం



–రాధశ్రీ
సెల్: 9494481210



(మే 15 మహర్షి దేవేంద్రనాథ్ టాగోర్ జయంతి...)




విశాలాక్షి
సాహిత్య మాస పత్రిక
శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి
స్మారక కథల పోటీ



విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో, మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాము.

బహుమతుల వివరాలు

| | |
|---|---|
| వేసవి కథల సంపుటి కోసం 15 కథలు ఎంపిక జరుగుతుంది. ఒక్కో కథకు రూ. 3000/- సమాన బహుమతి ఉంటుంది. | 15 కథలు ఒక్కో కథకు రూ. 3000/- సమాన బహుమతి మొత్తం రూ. 45,000/- |

ఎంపికైన మరికొన్ని కథలు - విశాలాక్షి మాసపత్రికలో సాధారణ ప్రచురణ జరుగుతుంది

- ✓ స్వచ్ఛమైన తెలుగు కథ. కొత్త కథ అయి ఉండాలి
- ✓ తిరిగొచ్చిన కథలు, జెరాక్స్ ప్రతులు వద్దు
- ✓ ఏదైనా సామాజిక అంశం.
- ✓ A4లో 5 పేజీలు మించకుండా యూనికోడ్‌లో మెయిల్‌కు పంపాలి.
- ✓ కథ మీద రచయిత పేరు లేకుండా ప్రత్యేకంగా హామీ పత్రంలో రాయాలి.
- ✓ ఎంపిక కాని కథలు తిరిగి పంపరనే విషయాలు ప్రత్యేకంగా చెప్పటం లేదు.

కథలు పంపవలసిన మెయిల్ :
e-mail : visalakshi.poteelu@gmail.com

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

గడువు :
15-7-2021

# కోవిడ్‌పై పోరాటంలో తమ వంతుగా అత్యవసర వైద్య సామాగ్రిని ఆటంకాలు లేకుండా బట్వాడా చేస్తున్న భువనేశ్వర్ విమానాశ్రయం

హైదరాబాద్ , మే 14: కోవిడ్19కి వ్యతిరేకంగా దేశం చేస్తున్న పోరాటాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిరోజూ దేశంలోని విమానాశ్రయాలు అత్యవసర వైద్య సామాగ్రి, పరికరాలను దేశం నలుమూలలకు రవాణా చేస్తున్నాయి. ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన భుబనేశ్వర్ విమానాశ్రయం, దాని భాగస్వాములు 24 లీ 7 వైద్య పరకరాలు, సామాగ్రిని నిరాటంకంగా రవాణా చేసే సౌకర్యాన్ని కల్పించడంలో చురుకైన పాత్రను పోషిస్తున్నారు.




భుబనేశ్వర్ విమానాశ్రయం ద్వారా 9మే, 2021వరకు మొత్తం 669 డబ్బాల (20.53 మెట్రిక్ టన్నుల) కోవిడ్ వాక్సిన్‌ను వివిధ ఎయిర్ లైన్స్ ద్వారా రవాణా చేశారు. దేశంలోని ఆక్సిజన్ సంక్షోభాన్ని అధిగమించేందుకు మొత్తం 156 ఖాళీ ఆక్సిజన్ ట్యాంకులను, 526 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను, 140 ఆక్సిజన్ సిలెండర్లను సి17, సి130జె, ఎఎన్32 వంటటి 75 భారతీయ వైమానిక దళ విమానాలు 23 ఏప్రిల్ 2021 నుంచి 11 మే 2021 వరకు రవాణా చేశాయి. వివిధ ఎయిర్‌లైన్ల ద్వారా 41 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను కూడా రవాణా చేశారు. ప్రస్తుతం 10లీటర్ల సామర్థ్యం గల 3500 సియామ్‌లెస్ సిలెండర్లను, 46.2 లీటర్ల సామర్థ్యం గల 1520 సియామ్‌లెస్ సిలెండర్లను రవాణా చేయానున్నారు. ఒకవారంలో విదేశాల నుంచి పంపిన సరుకు వస్తుందని అంచనా.

ఈ కార్యకలాపాలే కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించేందుకు అవసరమైన కోవిడ్ 19 సంబంధిత మార్గదర్శకాలను, ప్రోటోకాళ్ళను భుబనేశ్వర్ విమానాశ్రయం అనుసరిస్తోంది. ప్రజలు గుమి గూడకుండా, దఫాలవారీగా సమయాన్ని పాలన చేస్తూ కోవిడ్‌కు తగిన ప్రవర్తనను ఎల్లప్పుడూ అనుసరించవలసిందిగా ప్యాసెంజర్లకు, భాగస్వాములకు, సందర్శకులకు, ఉద్యోగులకు విమానాశ్రయ సిబ్బంది నిరంతరం విజ్ఞప్తి చేస్తోంది. కోవిడ్ కు తగిన ప్రవర్తన గురించి చైతన్యాన్ని కలిగించేందుకు, తద్వారా ప్రయాణికుల భద్రతకు భరోసా ఇచ్చేందుకు, విమానాశ్రయంలో టెర్మినళ్ళ వద్ద వివిధ ఎలక్ట్రానిక్, శాశ్వత డిస్ప్లేల ద్వారా సూచనలను ప్రదర్శిస్తోంది.

అన్ని విమానాశ్రయాలు తమకు సాధ్యమైనంతగా యుద్ధంలో భాగస్వాములయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. భుబనేశ్వర్ విమానాశ్రయం ఎఎఐ సిబ్బందికి, ఇతర భాగస్వాములకు ఒడిషా ప్రభుత్వ సహాయ సహకారాలతో అన్ని రక్షణ చర్యలనూ పరిగణనలోకి తీసుకుని కోవిడ్ వాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించింది.

# రవాణా చేయడానికి వీలు కలిగే సాంకేతిక సాంప్రదాయ మరియు పర్యావరణ అనుకూల దహన వ్యవస్థను అభివృద్ధి చేసిన ఐఐటీ



హైదరాబాద్ , మే 14: ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రోపర్ కదిలే ఎలక్ట్రిక్ దహన వ్యవస్థ నమూనాను అభివృద్ధి చేసింది. ఇది కలపను ఉపయోగించినప్పటికీ పొగలేని దహన సంస్కారాలను కలిగి ఉన్న మొట్టమొదటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు పేర్కొంది. ఇది దహనానికి అవసరమైన చెక్కలో సగం ఉపయోగిస్తుంది. దహన వాయు వ్యవస్థను ఉపయోగించే సాంకేతికత కారణంగా పర్యావరణ అనుకూలమైనది.

ఇది విక్-స్టవ్ టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. దీనిలో ఒత్తు వెలిగించినప్పుడు పసుపు రంగులో మెరుస్తుంది. ఇది వాటిపై ఏర్పాటు చేసిన దహన వాయు వ్యవస్థ సహాయంతో పొగలేని నీలి మంటగా మార్చబడుతుంది.

ఈ వ్యవస్థను అభివృద్ధి చేసిన ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ హర్‌ప్రీత్ సింగ్, ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ అండ్ స్పాన్సర్డ్ రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ (ఐసిఎస్ఆర్ ఉఐఐ) మాట్లాడుతూ దహన వ్యవస్థ లేదా భస్మీకరణం 1044 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడెక్కుతుంది. ఇది పూర్తి స్టెరిలైజేషన్‌ను నిర్ధారిస్తుంది.

బండి ఆకారంలో ఉన్న ఈ వ్యవస్థకు చక్రాలు ఉన్నాయి. తద్వారా ఎక్కువ ప్రయత్నాలు లేకుండా ఎక్కడైనా రవాణా చేయవచ్చు. దీని ప్రాథమిక మరియు ద్వితీయ వేడి గాలి వ్యవస్థ కోసం దహన గాలిని కలిగి ఉంటుంది. "సాధారణ చెక్క ఆధారిత దహన సంస్కారంలో 48 గంటలు అవసరమయ్యే శీతలీకరణ సమయంతో సహా 12 గంటలలోపు శరీర దహనం పూర్తవుతుంది" అని ప్రొఫెసర్ హర్‌ప్రీత్ తెలిపారు. తక్కువ కలపను ఉపయోగించడం వల్ల కార్బన్ సగానికి తగ్గించవచ్చు. వక్రీభవన ఉష్ణ నిల్వ లేనప్పుడు తక్కువ శీతలీకరణ సమయం అవసరమని ఆయన అన్నారు. ఇది వ్యవస్థ యొక్క రెండు వైపులా వేడి నష్టం మరియు తక్కువ చెక్క వినియోగం కోసం స్టెయిన్లెస్ స్టీల్ ఇన్సులేషన్ కలిగి ఉంటుంది. బూడిదను సులభంగా తొలగించడానికి ఇది క్రింద ఒక ట్రేను కలిగి ఉంది.

ఎలక్ట్రిక్ దహన వ్యవస్థ యొక్క ప్రోటోటైప్ డమ్మీ-టెస్టింగ్.

దహన సంస్కారాల కోసం చెక్కను కూడా ఉపయోగించడం ద్వారా సాంప్రదాయాన్ని పాటించినట్టు అవుతుందని ఆయన తెలిపారు. చెక్కమంటపై దహన సంస్కారాలు చేసే నమ్మకాలు మరియు సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని ఇది తయారు చేయడం జరిగింది.

ప్రస్తుత మహమ్మారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని "ఈ వ్యవస్థను ఉపయోగించడం వల్ల కలపను ఏర్పాటు చేయడంలో ఆర్థిక భారం భరించలేని వారి దగ్గరి మరియు ప్రియమైనవారికి గౌరవప్రదమైన దహన సంస్కారాలు అందించవచ్చు" అని చీమా బాయిలర్స్ లిమిటెడ్ ఎండి హర్జిందర్ సింగ్ చీమా అన్నారు. ఇది పోర్టబుల్ కాబట్టి సంబంధిత అధికారుల అనుమతితో ఏ ప్రదేశానికి తీసుకెళ్లవచ్చునని ఆయన అన్నారు. ప్రస్తుత సందర్భంలో ఉన్నట్లుగా, శ్మశానవాటికలో స్థలాన్ని రద్దీని నివారించడానికి ఇది ప్రజలకు సహాయపడుతుంది.

# కోవిడ్-19 మహమ్మారి సమయంలో జాతీయ దూరవాణి-వైద్యసేవ (ఈ-సంజీవని) ద్వారా 50 లక్షల మందికి పైగా రోగులకు సేవాప్రదానం

హైదరాబాద్ , మే 14: కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రతిష్ఠాత్మక జాతీయ దూరవాణి-వైద్యసేవ "ఈ-సంజీవని"కి శ్రీకారం చుట్టిన తర్వాత ఏడాదికిపైగా వ్యవధిలో 50 లక్షలమంది (అరకోటి)కి పైగా రోగులకు సేవలందాయి. తొలిసారి దేశవ్యాప్త దిగ్బంధం సందర్భంగా అవుట్ పేషెంట్ సేవలు నిలిచిపోయిన నేపథ్యంలో రోగి-డాక్టర్ మధ్య సుదూర సంప్రదింపు సేవలందించే ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రిత్వశాఖ 2020 ఏప్రిల్ నుంచి ప్రారంభించింది. ప్రస్తుతం 31 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'ఈ-సంజీవని' కింద సేవాప్రదానం కొనసాగుతోంది. ఈ మేరకు దేశం మొత్తంమీద నిత్యం సుమారు 40,000 మంది దీనిద్వారా ప్రమాదరహిత, స్పర్శరహిత ఆరోగ్య సంరక్షణ సేవలు అందుకుంటున్నారు.

'ఈ-సంజీవని'లో రెండు రకాలు:

కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్మాన్ భారత్ (ఏబీ) పథకం'లో భాగంగా 'కూడలి-శాఖల' నమూనాలో దేశంలోని అన్ని ఆరోగ్య-శ్రేయో కేంద్రాల్లో (హెచ్‌డబ్ల్యూసీ) 'ఈ-సంజీవని' కింద డాక్టర్ల మధ్య 'ఏబీ- హెచ్‌డబ్ల్యూసీ' పేరిట దూరవాణి-వైద్య వేదిక ప్రారంభమైంది. ఈ వేదికను ఇప్పటిదాకా దేశవ్యాప్తంగాగల 18,000కుపైగా ఆరోగ్య-శ్రేయో కేంద్రాల్లో, 1,500 కూడళ్లలో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2022 డిసెంబరు నాటికి 1,55,000 'హెచ్‌డబ్ల్యూసీ'లలో దూరవాణి-వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. కాగా, 2019 నవంబరులో మొత్తం 22 రాష్ట్రాలు 'ఈ-సంజీవని ఏబీ- హెచ్‌డబ్ల్యూసీ' వేదికను ప్రారంభించాయి. ఈ డిజిటల్ నమూనా వినియోగంద్వారా ప్రత్యేక నిపుణులు-డాక్టర్ల ద్వారా దాదాపు 20 లక్షల మంది రోగులకు ఆరోగ్య సేవలు లభించాయి. ఈ సేవలకు సంబంధించి మొత్తం 21,000 మంది ప్రత్యేక నిపుణులు, వైద్యులు, సామాజిక ఆరోగ్యాధికారులకు 'ఈ-సంజీవని ఏబీ- హెచ్‌డబ్ల్యూసీ' వేదికద్వారా శిక్షణ ఇవ్వబడింది.

ఈ జాతీయ దూరవాణి-వైద్యసేవలో రెండోరకం 'ఈ-సంజీవని ఓపీడీ' కాగా, ఈ ఉచిత సేవ ప్రస్తుతం 28 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతోంది. తదనుగుణంగా 'ఈ-సంజీవని ఓపీడీ' కింద 350 అవుట్ పేషెంట్ విభాగాలు ఏర్పాటు కాగా, వీటిలో 300 ప్రత్యేక నిపుణుల 'ఓపీడీ'లు ఉన్నాయి. 'ఈ-సంజీవని ఓపీడీ' ద్వారా నేటివరకూ 30,00,000 మందికిపైగా రోగులు సేవలు అందుకున్నారు. సదరు డిజిటల్ ఆరోగ్య కార్యక్రమం ద్వారా పౌరులకు వారి ఇళ్లవద్దనే సేవలు అందుబాటులోకి వచ్చాయి.

మహమ్మారి వ్యాప్తి ఆరంభమైనప్పటి నుంచి కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అందిస్తున్న జాతీయ దూరవాణి-వైద్యసేవను సద్వినియోగం చేసుకోవడంలో అటు రోగులు, ఇటు వైద్యుల నుంచి విశేష సత్వర, విస్తృత స్పందన లభించింది. తద్వారా దేశంలో ఇప్పటికే విపరీత భారం మోస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవాప్రదాన వ్యవస్థకు 'ఈ-సంజీవని' ఒక సమాంతర ఆరోగ్య వ్యవస్థగా పనిచేస్తోంది. నిరుడు ఏప్రిల్ నెలలో 'ఈ-సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించినపుడు కోవిడేతర ఆరోగ్య సేవలందించే విధానంగానే పరిగణించబడింది. కానీ, సదరు ఎలక్ట్రానిక్ ఆరోగ్యసేవ అనువర్తనంతో లభ్యమయ్యే ప్రయోజనాల దృష్ట్యా వివిధ రాష్ట్రాలు సత్వరం దీన్ని అందిపుచ్చుకున్నాయి. తదనుగుణంగా కోవిడ్-19 సంబంధిత ఆరోగ్య సేవలను కూడా అందించేందుకు 'ఈ-సంజీవని' కార్యక్రమం కింద వివిధ ప్రక్రియలు, కార్యకలాపాల ప్రణాళికను రూపొందించాయి. ఈ ప్రణాళిక మేరకు గృహనిర్బంధ చికిత్స పొందుతున్న కోవిడ్-19 రోగుల పర్యవేక్షణ, యాజమాన్యం కోసం ఆయా రాష్ట్రాలు 'ఓపీడీ'లను ఏర్పాటు చేసుకున్నాయి.

ఏకాంత గృహవాస ప్రత్యేక ఓపీడీ సేవల దిశగా కొన్ని రాష్ట్రాలు కృషి చేస్తున్నాయి. ఈ మేరకు చివరి ఏడాది వైద్య విద్యార్థులద్వారా సుదూర విధానంలో రోగులకు కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని యోచిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కేసుల భారం పెరుగుతున్నందున 'ఈ-సంజీవని ఓపీడీ'ని 24 గంటలూ వినియోగిస్తున్నాయి. ఈ క్రమంలో 'ఈ-సంజీవని' వినియోగం ద్వారా రికార్డు స్థాయిలో 10 లక్షల సంప్రదింపు సేవలందించిన తమిళనాడు అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ప్రజలకు సేవలు అందించడం కోసం కేంద్ర రక్షణ శాక కూడా సాయుధ బలగాల వైద్యసేవలకు చెందిన అనుభవజ్ఞులను కూడా రంగంలో దింపింది.

ఇక 'ఈ-సంజీవని' సృష్టికర్తలు ప్రస్తుతం మొహాలీలోని 'సి-డాక్' కేంద్రంలో 'ఈ-సంజీవని ఓపీడీ' విశేషతకు మరో వినూత్న విశేషతను జోడించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే 'ఈ-సంజీవని ఓపీడీ' వేదికనుంచే 'జాతీయ ఓపీడీల' నిర్వహణ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చే వీలుంది. తద్వారా దేశంలోని ఏ ప్రాంతంలోగల పౌరులకైనా వైద్యులు సుదూర ఆరోగ్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు, వైద్యుల సంఖ్యలో అసమతౌల్యం, కొరత వంటి సవాళ్లను పరిష్కరించడంలో ఈ వినూత్న ఆవిష్కరణ తోడ్పడనుంది. 'ఈ-సంజీవని' అమలు చేస్తున్న (సంప్రదింపుల సంఖ్య దృష్ట్యా) అగ్రస్థానంలోని 10 రాష్ట్రాల జాబితా ఇలా ఉంది: తమిళనాడు (1044446), కర్ణాటక (936658), ఉత్తర ప్రదేశ్ (842643), ఆంధ్రప్రదేశ్ (835432), మధ్యప్రదేశ్ (250135), గుజరాత్ (240422), బీహార్ (153957), కేరళ (127562), మహారాష్ట్ర (127550), ఉత్తరాఖండ్ (103126).

## లాక్‌డౌన్ పక్కా అమలయ్యేలా చూడాలి : మంత్రి వేముల



వేల్పూరుమే 14 : నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో లాక్‌డౌన్ పక్కా అమలయ్యేలా చూడాలి అని అధికారులను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజల్లో కోవిడ్‌పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో విస్తరించిన మహమ్మారి ప్రజల స్వీయ నియంత్రణతో తగ్గుముఖం పడుతున్నా..ఇంకా అప్రమత్తంగానే ఉండాలి అని చెప్పారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో కోవిడ్ పరిస్థితులపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం ఉదయం పోలీస్,రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

నియోజకవర్గంలోని గ్రామాలు, మండల కేంద్రాల్లో ప్రజలు స్వచ్ఛంద లాక్ డౌన్ పెట్టుకోవడం వల్ల కరోనా వ్యాప్తి చైన్ బ్రేక్ చేసినట్లైందని అన్నారు. ఒకరినుండి ఒకరికి వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి కేసీఆర్ లాక్ డౌన్ నిర్ణయం తీసుకున్నారన్నారు.

పోలీస్ యంత్రాంగం లాక్ డౌన్ పక్కా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. అన్ని మండల కేంద్రాలతో పాటు, గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు నాలుగు గంటల పాటు సడలింపు ఉన్న నేపథ్యంలో ఆ సమయంలోనే రైతులు కూడా వారికి అవసరమైన ఫెస్టిసైడ్స్, విత్తనాలు,వ్యవసాయ పనిముట్లు తీసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి మినహాయింపు ఉన్నప్పటికీ ఆయా షాపుల వారిని కూడా లాక్ డౌన్ సడలింపు సమయంలోనే తీసేలా ప్రోత్సహిస్తే వైరస్ వ్యాప్తి కట్టడి ఇంకా సులువు అవుతుందని అన్నారు.ఈ సందర్భంగా రైతులు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అన్నం పెట్టే రైతు ఆరోగ్యం కూడా కేసీఆర్ ప్రభుత్వానికి ముఖ్యమే అని అన్నారు.

ప్రజల్లో కోవిడ్ పై ఇంకా కొద్దిగా అపోహలు ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో విస్తరించిన మహమ్మారి ప్రజల స్వీయ నియంత్రణతో తగ్గుముఖం పడుతున్నా.. ఇంకా అప్రమత్తంగానే ఉండాలని చెప్పారు. కోవిడ్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, డిఏస్పీ రఘు, సిఐ విజయ్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా బాధితులకు అండగా..

### -ఎమ్మెల్యే చెన్నమనేని ఔదార్యం

**వేములవాడలో 100 పడకల దవాఖానకు 15 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు**

**కలెక్టర్‌కు అందజేసిన జడ్పీ అధ్యక్షురాలు అరుణ**



రాజన్న సిరిసిల్ల మే, 14(నేటినిజం ప్రతినిధి): ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కరోనా బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణవాయువు అవసరం పెరిగిపోతున్నందున ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందించాలని నిర్ణయించారు. వేములవాడ దవాఖాన కోసం తన సొంత నిధులు దాదాపు 10లక్షలతో 15 ఫిలిప్స్ కంపెనీ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను కొనుగోలు చేసి జర్మనీ దేశం నుంచి పంపించగా, గురువారం జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ అధ్యక్షురాలు మాధవి కలిసి దవాఖాన ఆవరణలో కలెక్టర్ కృష్ణభాస్కర్, అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులల్లో కరోనా వైరస్ బాధితులకు ప్రాణవాయువు ఎంతో అవసరమని, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చొరవ తీసుకొని ఉచితంగా అందించడం అభినందనీయమని చెప్పారు. వేములవాడ దవాఖాన ప్రారంభమయ్యేలోగా.. సిరిసిల్ల జిల్లా దవాఖానలో వినియోగిస్తామని చెప్పారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ వేములవాడ ప్రాంత ప్రజల కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు రూ.20కోట్లతో వందపడకల దవాఖానను నిర్మిస్తున్నారని, త్వరలోనే అందుబాటులోకి రాబోతున్నదని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఆవుల సుమన్‌మోహన్‌రావు, వైద్యాధికారి రేగులపాటి మహేశ్‌రావు, ఎంపీపీ బూర వజ్రమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధురాజేందర్, జడ్పీటీసీ మ్యాకల రవి, ఏఎంసీ చైర్మన్ గడ్డం హన్మండ్లు, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్యయాదవ్, రేగులపాటి కృష్ణదేవరావు, కౌన్సిలర్లు జోగిని శంకర్, మారం కుమార్, యాచమనేని శ్రీనివాసరావు, ఇప్పపూల అజయ్, నరాల శేఖర్, గోలి మహేశ్, నాయకులు రాఘవరెడ్డి, బాబు, రాజు, యేస తిరుపతి, తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు విలువైనవి

### -చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

వరంగల్, మే 14 : కరోనా కాలంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. లాక్‌డౌన్ సమయంలో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఉచిత భోజన సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ కరోనాపై ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పోరాడుతున్న పారిశుధ్య కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. లాక్‌డౌన్ కాలంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ప్రతి నాలుగు డివిజన్లకు ఒక ఉచిత భోజన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 20 భోజన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రతి కేంద్రంతో 200 మందికి భోజన వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉచిత భోజన కేంద్రాలను పారిశుధ్య కార్మికులతో పాటు ఆశ వర్కర్లు వినియోగించుకోవాలని మేయర్ సూచించారు. విలీన గ్రామాల్లో విధులకు హాజరయ్యే కార్మికులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ, డీఈ రవీందర్, గ్రేటర్ జేఏసీ చైర్మన్ గౌరీశంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్, టీఆర్ఎస్ నాయకులు దేవరకొండ సురేందర్, కొడకండ్ల సదాంత్, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.



## పుష్కలంగా ప్రాణ వాయువు

**జిల్లాకు ఆక్సిజన్ కొరత తీర్చిన మంత్రి అజయ్**

**ఐటీసీ నుంచి రోజుకు 5 మెట్రిక్ టన్నులు**

**మంత్రికి కొవిడ్ బాధితుల నీరాజనాలు**

**వైద్యశాలలో ట్యాంకర్‌ను ప్రారంభించిన మంత్రి, కలెక్టర్, సీపీ**




ఖమ్మం మే 14: జిల్లాలో ఆక్సిజన్‌కు కొరత తీర్చేందుకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్ రంగలోకి దిగారు. ఆక్సీజన్ సరఫరా చేసేలా సారపాకలోని ఐటీసీ యాజమాన్యాన్ని ఒప్పించారు. ప్రతిరోజు 5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆక్సీజన్ ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. లిక్విడ్ ఆక్సీజన్‌ను ప్రతి రోజు తెప్పించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు అందించేలా ఏర్పాటు చేశారు. గురువారం ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆక్సిజన్ ట్యాంకర్‌ను ప్రారంభించారు.

ఆయన ఏదైనా చెప్పారంటే క్షణం కూడా ఆలస్యం చేయరు. యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తారు. ఆయనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. జిల్లాలో ఆక్సీజన్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఇటీవల ఆయన ప్రకటించారు. సరిగ్గా ఐదు రోజుల వ్యవధిలోనే ఆ హామీని నెరవేర్చారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకున్న మంత్రి.. స్వయంగా రంగంలోకి దిగి సారపాక ఐటీసీ యాజమాన్యంతో చర్చించారు. కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో వేలాదిమంది భయం గుప్పిట్లో బతులీడుస్తున్నారని, సామాజిక బాధ్యతగా ఆలోచన చేసి అండగా నిలవాల్సిన అవశ్యకత ఉందని వివరించారు. తద్వారా ప్రాణవాయువు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించారు. ఇక నుంచి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో కొవిడ్ బాధితులకు అత్యవసరంగా అందిస్తున్న ఆక్సీజన్‌ను లేదని చెప్పడానికి వీల్లేకుండా చేశారు.

రోజుకు 5 మెట్రిక్ టన్నులు సరఫరా..

కరోనా సెకండ్ వేవ్ మొదలైన నాటి నుంచి జిల్లాలోని అన్ని ప్రైవేట్ దవాఖానల్లో ఆక్సిజన్ కొరత ఉందంటూ ప్రచారం జరిగింది. దీంతో ఆయా యాజమాన్యాలు కొవిడ్ బాధితులకు ఆక్సీజన్ ఏర్పాటు చేసినందుకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. సారపాక ఐటీసీ యాజమాన్యంతో చర్చించారు. జిల్లాలోని అన్ని కొవిడ్ దవాఖానలకు సరిపడే విధంగా రోజుకు 5 మెట్రిక్ టన్నుల ఆక్సీజన్‌ను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా ఆక్సీజన్‌ను ఖమ్మానికి సకాలంలో తీసుకువచ్చేందుకుగాను మంత్రి స్వయంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేయించారు. గురువారం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో ట్యాంకర్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా కొవిడ్ బాధితులను వేధిస్తున్న ఆక్సీజన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినందున మంత్రి పువ్వాడకు జిల్లా ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు నీరాజనాలు పలుకుతున్నారు.

ప్రజా శ్రేయస్సే ముఖ్యం -మంత్రి అజయ్

జిల్లాలో కరోనా వ్యాప్తి ఉధృతంగా ఉంది. ఆ మహమ్మారి కాటుకు చాలామంది బలవుతున్నారు. ప్రైవేట్ దవాఖానలకు వెళితే ఆక్సీజన్ లేదంటూ ప్రజల భయాందోళనలను రెట్టింపు చేస్తున్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్సీజన్ సరఫరా ట్యాంకర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సే తనకు ముఖ్యమని, ఆక్సీజన్ కొరత కారణంగా ఏ ఒక్కరూ కన్నుమూయకూడదనే ఏకైక లక్ష్యంతో భద్రాచలం ఐటీసీతో చర్చించానని చెప్పారు. కోరిన వెంటనే సానుకూలంగా స్పందించిన యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఆక్సీజన్ లేదనే సమాధానం రాకూడదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి కొవిడ్ బాధితుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బీ మాలతి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు, ఆర్ఎంవో డాక్టర్ బీ శ్రీనివాసరావు, డాక్టర్ కే రాజశేఖర్‌గౌడ్, హాస్పిటల్ ఉద్యోగులు నందగిరి శ్రీను, ఆర్‌వీఎస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్‌పై ఆందోళన వద్దు

### -సమీక్ష సమావేశంలో మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం మే 14: కరోనా కట్టడికి జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ ప్రజ్ఞా సమావేశ మందిరంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి గురువారం నిర్వహించిన హైపవర్ కమిటీ సమావేశంలో ఇకముందు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై మంత్రి సమీక్షించారు. పోలీసు, టాస్క్‌పోర్స్, మెడికల్ అండ్ హెల్త్, డ్రగ్ కంట్రోల్, ఐఎంఏ, మున్సిపాలిటీ ఇతర శాఖల ఉన్నతాధికారులతో మంత్రి రివ్యూ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆక్సిజన్ లభ్యత, బెడ్లు, మెడిసిన్, ఇంటింటి జ్వర సర్వే తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కరోనా సెకండ్ వేవ్‌లో వైరస్ ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉన్న క్రమంలో అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో కొవిడ్ కేసులకు సంబంధించి అత్యధికంగా ప్రభుత్వ ఆసుప్రతుల్లోనే వైద్యం అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆక్సిజన్ కొరత లేదని, అవసరాన్ని బట్టి డిమాండ్ మేరకు పంపిణీ చేస్తామని అన్నారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెమిడెసివర్ మెడిసిన్ అవశ్యకతను కూడా పర్యవేక్షించాలని, అవసరం మేరకు అందించాలని సూచించారు. బ్లాక్‌మార్కెట్ చేసే వారిపై కేసు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కూడా కట్టడి చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిల్లో కొవిడ్ పేషెంట్లకు వైద్యం అందించే క్రమంలో నిబద్ధతతో వ్యవహరించాలని, ప్రభుత్వం నిర్ధారించిన ధరలను మాత్రమే వసూలు చేయాలని, ధరల వివరాలను డిస్‌ప్లే చేయాలని, అధిక చార్జీలు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో కొవిడ్ వైద్యం అందించేందుకు ఎంపానల్ చేసుకున్న ప్రైవేట్ ఆస్పత్రులకు ఆక్సీజన్, రెమిడెసివర్ సరఫరాను పారదర్శకంగా పర్యవేక్షించాలని, టాస్క్‌పోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో చర్యలు తీసుకొని కట్టడి చేయాలని, తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలని మంత్రి సూచించారు.

లాక్‌డౌన్‌ను ప్రజలందరూ తప్పనిసరిగ్గా పాటించాలని సూచించారు. నిర్ణీత సమయంలోనే నిత్యావసరాలు సమర్చుకోవాలని, పోలీసులకు సహకరించాలని మంత్రి కోరారు. ఇంటింటి జ్వర సర్వేలో కొవిడ్ లక్షణాలు కలిగిన వారిని వైద్య సిబ్బంది గుర్తిస్తున్నారని అన్నారు. మెడికల్ కిట్లను అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు వైద్యం అందించే క్రమంలో పాటిస్తున్న నిబంధనలను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో సీపీ విష్ణు ఎస్ వారియర్, అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ అనురాగ్ జయంతి, డీఆర్‌వో శిరీష, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రామానుజం, ప్రసన్నకుమార్, ఐఎంఏ ప్రతినిధి కూరపాటి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ జిల్లాలో కర్నాటక సరిహద్దులు మూసివేత



జోగులాంబ గద్వాల మే 14 : కర్ణాటక రాష్ట్రంలో కరోనా ఉధృతి ఎక్కువగా ఉన్నందున కర్ణాటక ప్రజలు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలకు రాకుండా సరిహద్దులు మూసి వేస్తున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పాగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ముసల్ దొడ్డి వద్ద సరిహద్దులను కేటిదొడ్డి పోలీసులు మూసి వేశారు.

ఈ సందర్భంగా పాగుంట సర్పంచ్ సుభాషిణి రెడ్డి మాట్లాడుతూ..లాక్ డౌన్ నేపథ్యంలో కరోనా కట్టడికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పాగుంట ప్రజలు ఎవరూ ఇండ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అలాగే కర్ణాటక వైపు కూడా వెళ్లరాదని కోరారు.

# రెండు/మూడో దశలో 2-18 ఏళ్లున్న వారిపై కొవాగ్జిన్ క్లినికల్ ట్రయల్స్‌కు డీసీజీఐ అనుమతి

న్యూఢిల్లీ, మే 14: : రెండు/మూడో దశలో, 2-18 ఏళ్లున్న వారిపై కొవాగ్జిన్ (కొవిడ్ టీకా) క్లినికల్ ట్రయల్స్ చేపట్టేందుకు, ఆ టీకా ఉత్పత్తి సంస్థ భారత్ బయోటెక్ లిమిటెడ్‌కు "డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా" (డీసీజీఐ) అనుమతినిచ్చింది. క్లినికల్ ట్రయల్స్ కోసం "విషయ నిపుణుల కమిటీ" (ఎస్ఈసీ) చేసిన సిఫారసును సమగ్రంగా పరిశీలించి, బుధవారం ఆమోదించింది.

రెండు/మూడో దశలో ఈ క్లినికల్ ట్రయల్ చేపట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) ప్రతిపాదన సమర్పించింది. స్వచ్ఛందంగా ముందుకువచ్చిన 525 ఆరోగ్యవంతులకు ఆ సంస్థ ప్రయోగాత్మకంగా టీకా ఇవ్వనుంది.

ప్రయోగంలో భాగంగా, తొలి రోజున, 28వ రోజున టీకాను కండరాల ద్వారా శరీరానికి ఇస్తారు.

భారత్ బయోటెక్ ప్రతిపాదనపై వేగంగా స్పందించి, 11.05.2021న ఎస్ఈసీలో చర్చించారు. సమగ్ర చర్చ తర్వాత, క్లినికల్ ట్రయల్ నిర్వహించడానికి అనుమతి మంజూరు చేయాలని సిఫార్సు చేశారు. కమిటీ సూచించిన షరతులకు లోబడి ఈ ప్రయోగాలు జరుగుతాయి.

# టీఆర్ఎస్‌లో ఆపరేషన్ హుజురాబాద్..

న్యూఢిల్లీ, మే 14: హుజూరాబాద్‌పై టీఆర్ఎస్ దృష్టి పెట్టింది. మంత్రివర్గం నుండి ఈటల రాజేందర్ తొలగింపు అనంతరం ఆయన టీఆర్ఎస్ పార్టీకి దూరం కావడం ఖాయం కావడంతో స్థానికంగా పార్టీ బలోపేతంపై నేతలు దృష్టి సారించారు. మంత్రి గంగుల కమలాకర్ హుజూరాబాద్ ప్రజా పతినిధులపై గురిపెట్టి.. చర్చలు జరుపుతున్నారు. హుజూరాబాద్ మునిసిపాలిటీని 11మంది కౌన్సిలర్లను పిలిచి మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరత్రా మంజూరుచేయిస్తామని.. హుజూరాబాద్, జమ్మికుంట మునిసిపాలిటీలలో పెండింగ్ పనులకు సంబంధించిన జాబితా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. త్వరలో మంత్రి కేటీఆర్, తాను హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తానని ప్రకటించారు. టీఆర్ఎస్ అధిష్టానం హుజూరా బాద్ నియోజకవర్గ నేతలను.. ఈటల రాజేందర్ వెంట వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో టీఆర్ఎస్ వర్సెస్ తాను మాత్రమే బరిలో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రజాప్రతి నిధులను భయపెట్టి లొంగదీసుకున్నా ప్రజలు తనవెంటే ఉంటారని, హుజూరా బాద్‌లో విజయం సాధిస్తే రాష్ట్ర రాజకీయాలకు అది మలుపవుతుందని రాజేందర్ చెబుతున్నారు. ఈ క్రమంలో ఇతర పార్టీల నేతలను కలుస్తూ.. అంతరంగం తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తనపై సామాజిక మాధ్య మాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ ఆడియో సందేశం విడు దల చేశారు. ఈటల ఒకసారి మాటంటే వెనుకకు పోడని, ఆత్మగౌరవమే తనకు ముఖ్యమన్నారు. కొవిడ్ తగ్గగానే తాను రాజీనామా చేస్తానని చెబుతున్నారు.

# టీఆర్ఎస్ నేత కేశ్‌పల్లి ఆనంద్ రెడ్డి మృతి



నిజామాబాద్ ,మే 14: నిజామాబాద్ జిల్లాలకు చెందిన టీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేశ్‌పల్లి గంగారెడ్డి కుమారుడు ఆనంద్ రెడ్డి కన్నుమూశారు. గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈరోజు నిజామాబాద్‌లోని కేశ్ పల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో ఆనంద్‌రెడ్డి అంత్యక్రియలు జరుగనున్నాయి.

# అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ మే 14: కరోనా కట్టడి కోసం సీఎం కేసీఆర్ ఆదేశించిన మేరకు లాక్ డౌన్ సమయంలో అత్యవసరం అయితే తప్ప జనం బయటికి రావద్దని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల



పట్టణంలో లాక్ డౌన్ సందర్భంగా రోడ్ల పైకి వచ్చిన వాహనాలను మంత్రి , స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆపి వాహనదారులతో మాట్లాడారు. లాక్ డౌన్ అమలులో ఉన్నందున ఉదయం 6గం. నుంచి 10 గం వరకు నిత్యావసర వస్తువులు, ఇతర అవసరాలు తీర్చుకోవాలన్నారు. కరోనా విస్తరించకుండా ప్రజలు తోడ్పాటు అందించాలన్నారు.

# ఆ విమానంలోనే మా వాళ్లను వెనక్కి తీసుకొస్తాం: ఆస్ట్రేలియా ప్రధాని

న్యూఢిల్లీ, మే 14: ఇండియా నుంచి వచ్చే విమానాలపై ఈ నెల 15 వరకూ నిషేధం విధించిన ఆస్ట్రేలియా.. ఇక తమ వాళ్లను వెనక్కి తీసుకొచ్చే పనిలో ఉంది. శుక్రవారం ఇండియాకు అవసరమైన అత్యవసరాలను తీసుకెళ్లిన విమానమే తమ వాళ్లను స్వదేశానికి తీసుకురానున్నట్లు ఆ దేశ ప్రధాని స్కాట్ మోరిసన్ వెల్లడించారు. అయితే ఇండియాలో విమానం బయలుదేరే ముందే ప్రయాణికులు నెగటివ్ ఆర్టీ-పీసీఆర్, నెగటివ్ యాంటిజెన్ టెస్టుల రిపోర్టులను కచ్చితంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కొన్నాళ్ల పాటు ఇండియా విమానాలపై నిషేధం విధించడం వల్ల దేశంలోని క్వారంటైన్ కేంద్రాలపై ఒత్తిడిని తగ్గించందని, ఇక్కడ మూడో వేవ్ రాకుండా అడ్డుకోగలిగామని మోరిసన్ చెప్పారు.

ఈ విమానం శనివారం ఆస్ట్రేలియాలో ల్యాండవనున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. తొలి విడతగా 150 మంది ఆస్ట్రేలియా పౌరులు స్వదేశానికి వెళ్లనున్నారు. అక్కడ దిగిన తర్వాత రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉండాల్సి ఉంటుంది. సుమారు 9 వేల మంది ఆస్ట్రేలియా పౌరులు ఇండియాలో చిక్కుకుపోయారు. జూన్ చివరికి నాటికి వెయ్యి మందిని తిరిగి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు

# జియో ఫోన్ యూజర్లకు గుడ్‌న్యూస్

ముంబై, మే 14: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తన జియో ఫోన్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. కరోనా విపత్తు సమయంలో ఉచిత ఔట్‌గోయింగ్ కాల్స్‌ను అందించనున్నట్లు ప్రకటించింది. కరోనా విపత్తు ముగిసేవరకు నెలకు 300 నిమిషాల ఉచిత ఔట్‌గోయింగ్ కాల్స్(రోజుకు 10 నిమిషాలు) అందించడానికి రిలయన్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నట్లు రిలయన్స్ జియో శుక్రవారం తెలిపింది.కరోనా మహమ్మారి నేపథ్యంలో రీఛార్జ్ చేయించుకోలేకపోయిన జియోఫోన్ వినియోగదారులకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కొవిడ్ సెకండ్ వేవ్ ఉధృతి తీవ్రస్థాయిలో ఉండటంతో వైరస్ వ్యాప్తి కట్టడి కోసం చాలా రాష్ట్రాలు లాక్‌డౌన్ లేదా పాక్షిక లాక్‌డౌన్ వంటి ఆంక్షలు విధించాయి. ఇలాంటి సమయంలో

# పిఎం కేర్స్ కింద వెంటిలేటర్ల సరఫరాపై తాజా సమాచారం

న్యూఢిల్లీ, మే 14: నిరుటి నుంచి కోవిడ్ బాధితులకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సమర్ధవంతమైన చికిత్స అందించే విధంగా భారత ప్రభుత్వం వాటికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ వస్తోంది. ఇప్పుడున్న ఆస్పత్రి మౌలిక సదుపాయాలకు తోడుగా కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత కొనుగోళ్ళ ద్వారావెంటిలేటర్లు సహా అత్యవసర వైద్య పరికరాలు కొనుగోలు చేసి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, కేంద్ర ఆస్పత్రులకు, వైద్య సంస్థలకు పంపిణీచేస్తోంది.

అయితే పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ జిజిఎస్ వైద్య కళాశాలకు పిఎం కేర్స్ ద్వారా కొనుగోలు చేసి భారత ప్రభుత్వం పంపిణీ చేసిన వెంటిలేటర్లు సాంకేతిక కారణాల వలన పనిచేయకపోవటంతో నిరుపయోగంగా తయారయ్యాయని కొన్ని వార్తలు వెలువడ్డాయి. వాటిని అమ్మిన సంస్థలు అమ్మకానంతర సేవలు అందించటంలో విఫలమైనందువల్లనే అలాంటి పరిస్థితి ఏర్పడినట్టు ఆ వార్తల్లో ఆరోపించారు. అయితే, ఈ వార్తలు నిరాధారమైనవిగానే విషయంలో తగిన సమాచారం లేకుండానే ప్రచురించినట్టుగానూ కనబడుతోంది.

నిరుడు ఈ సంక్షోభం మొదలైనప్పుడు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలోనూ వెంటిలేటర్లు చాలా పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉండేవి. పైగా వెంటిలేటర్ల తయారీ కూడా దేశంలో నామమాత్రంగానే ఉండేది. విదేశీ తయారీదారులు సైతం భారతదేశానికి పెద్ద సంఖ్యలో ఎగుమతి చేయగలిగే పరిస్థితి ఉండేది కాదు. ఆ సమయంలోనే స్థానిక తయారీదారులను మేకిన్ ఇండియా వెంటిలేటర్ల తయారీకి ప్రోత్సహించటం జరిగింది. ఆ విధంగా పెద్ద ఎతున దేశ అవసరాలు తీర్చటానికి మార్గం ఏర్పడింది. వాళ్లలో చాలామందొ మొదటి సారిగా వెంటిలేటర్ల తయారీ చేపట్టారు. అందువల్లనే అందుబాటులో ఉన్న అతికొద్ది సమయంలోనే ఆ వెంటిలేటర్లను ఆ రంగంలో నిష్ణాతులైన వారిచేత క్షుణ్ణంగా పరిశీలింపజేసి, సాంకేతికంగా పరీక్షించటం ద్వారా, రోగులమీద ప్రయోగాత్మకంగా వాడిన మీదటే ఆమోదించటం జరిగింది. ఆ తరువాతనే వాటిని వాడకంలో పెట్టారు.

కొన్ని రాష్ట్రాలకు ఈ వెంటిలేటర్లు పంపినప్పటికీ వాటిని ఇంకా వాటి ఆస్పత్రులలో అమర్చుకోలేదు. గత 4-5 నెలలుగా కనీసం 50 వెంటిలేటర్లు ఇంకా అమర్చుకోని రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య కార్యదర్శి 20212 ఏప్రిల్ 11న లేఖ రాశారు. త్వరగా అమర్చుకోవటం ద్వారా వెంటికేటర్లను వాడకం లోకి తెచ్చుకోవాలని ఆలేఖలో సూచించారు.

ఎజివిఎ సంస్థ తయారు చేసిన 80 లో 71 వెంటిలేటర్లు పనిచేయటం లేదని, అవి పంజాబ్ లోని ఫరీద్ కోట్ జిజిఎస్ వైద్య కళాసాలలో వృధాగా పడి ఉన్నాయని ఇటీవల మీడియాలో వచ్చిన వార్తలకు సంబంధించి వాస్తవాలు ఇలా ఉన్నాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) 88 వెంటిలేటర్లు, ఎజివిఎ 5 వెంటిలేటర్లు పంజాబ్ లోని జిజిఎస్ కాలేజ్ కి సరఫరా చేశాయి. వాటిని విజయవంతంగా నెలకొల్పి పరీక్షించిన తరువాత ఆస్పత్రి అధికారులు అంతిమ ఆమోద ధృవపత్రం ఇచ్చారు.

బిఇఎల్ సంస్థ తాను అందజేసిన వెంటిలేటర్లలో ఎలాంటి లోపమూ లేదని, మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదని స్పష్టం చేసింది. గతంలో వారి సిబ్బంది వేరు వేరు సందర్భాలలో ఆ కళాశాలను సందర్శించి. చిన్న చిన్న మరమ్మతులు కూడా తక్షణమే చేసినట్టు పేర్కొంది. అక్కడి సిబ్బందికి కూడా వాటి పనితీరును ప్రయోగాత్మకంగా చూపినట్టు స్పష్టం చేసింది.

అయితే, జిజిఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో కేంద్ర ఆక్సిజెన్ గొట్టాలలో తగినంత పీడనం లేకపోవటం వంటి సమస్యలు ఉన్నట్టు తెలిసింది. పైగా, ఫ్లో సెన్సార్లు, బాక్టీరియా ఫిల్టర్లు. హెచ్ ఎం ఇ ఫిల్టర్ల వంటి ముఖ్యమైన విడి భాగాలను ఆస్పత్రి అధికారులు మార్చకపోవటం లాంటి లోపాలను కూడా గుర్తించారు. సరైన పీడనాన్ని నిర్వహించకపోవటం, విడి పరికరాల వాడకం తగినట్టు ఉండేలా చూడటం చాలా కీలకం. ఇవి సక్రమంగా లేనప్పుడు సివి 200 వెంటిలేటర్లు సరిగా పనిచేయకపోవచ్చు.

పైగా, బిఇఎల్ ఇంజనీర్లు 12వ తేదీన మళ్ళీ జిజిఎస్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి వారు చూసుకోవాల్సిన చిన్న చిన్న పరికరాలను మార్చటం ద్వారా ఐదు వెంటిలేటర్లను పనిలో పెట్టారు. ఆస్పత్రి అధికారుల సమక్షంలోనే ఇదంతా జరిగింది. సరిగా నడిపితే బాగా పనిచేస్తాయని, వెంటిలేటర్ల పనితీరు విశ్వసనీయమైనదని తేల్చారు.

పైగా ఆ వెంటిలేటర్లతోబాటు ఇచ్చిన యూజర్ మాన్యువల్ లోనే అన్ని మార్గదర్శకాలూ ఉన్నాయని, దాని వాడకానికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి, నిర్వహణ గురించి కూడా ఉన్నదని స్పష్టం చేశారు. అయితే చాలా పంజాబ్ లోని చాలా ఆస్పత్రులలో వాటిని పాటించకపోగా, సమస్య వెంటిలేటర్లలో ఉన్నట్టు చెప్పటం అర్థరహితమని పేర్కొన్నారు. బిఇఎల్ క్రమం తప్పకుండా ఈ సంక్షోభ సమయంలో అవసరమైన పూర్తి సాంకేతిక సహకారం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

అదే సమయంలో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి మే 9న అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖరాస్తూ వెంటిలేటర్ల తయారీదారుల హెల్ప్ లైన్ నెంబర్లను కూడా తెలియజేశారు. వెంటిలేటర్లమీద అతికించిన స్టిక్కర్లలో కూడా ఆ నెంబర్లు ఉన్నాయని పేర్కొంది. రాష్ట్రాలవారీ వాట్సాప్ గ్రూపుల్లో సైతం ఈ సమాచారం ఉందన, ఆయా నోడల్ అధికారులకు సమాచారం ఇచ్చామని, సాంకేతిక సమస్యలకు పరిష్కారం కోరేందుకు అది అనువుగా ఉంటుందని తెలియజేశారు. తయారీదారుల ఈ మెయిల్ ఐడి లు కూడా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇచ్చారు.

# కోవిడ్-19 మహమ్మారి సమయంలో (ఈ-సంజీవని) ద్వారా 50 లక్షలమందికిపైగా రోగులకు సేవాప్రదానం

న్యూఢిల్లీ, మే 14: కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రతిష్ఠాత్మక జాతీయ దూరవాణి-వైద్యసేవ "ఈ-సంజీవని"కి శ్రీకారం చుట్టిన తర్వాత ఏడాదికిపైగా వ్యవధిలో 50 లక్షలమంది (అరకోటి)కి పైగా రోగులకు సేవలందాయి. తొలిసారి దేశవ్యాప్త దిగ్బంధం సందర్భంగా అవుట్ పేషెంట్ సేవలు నిలిచిపోయిన నేపథ్యంలో రోగి-డాక్టర్ మధ్య సుదూర సంప్రదింపు సేవలందించే ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రిత్వశాఖ 2020 ఏప్రిల్ నుంచి ప్రారంభించింది. ప్రస్తుతం 31 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'ఈ-సంజీవని' కింద సేవాప్రదానం కొనసాగుతోంది. ఈ మేరకు దేశం మొత్తంమీద నిత్యం సుమారు 40,000 మంది దీనిద్వారా ప్రమాదరహిత, స్పర్శరహిత ఆరోగ్య సంరక్షణ సేవలు అందుకుంటున్నారు.

'ఈ-సంజీవని'లో రెండు రకాలు:

కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్మాన్ భారత్ (ఏబీ) పథకం'లో భాగంగా 'కూడలి-శాఖల' నమూనాలో దేశంలోని అన్ని ఆరోగ్య-శ్రేయో కేంద్రాల్లో (హెచ్‌డబ్ల్యూసీ) 'ఈ-సంజీవని' కింద డాక్టర్ల మధ్య 'ఏబీ- హెచ్‌డబ్ల్యూసీ' పేరిట దూరవాణి-వైద్య వేదిక ప్రారంభమైంది. ఈ వేదికను ఇప్పటిదాకా దేశవ్యాప్తంగాగల 18,000కుపైగా ఆరోగ్య-శ్రేయో కేంద్రాల్లో, 1,500 కూడళ్లలో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2022 డిసెంబరు నాటికి 1,55,000 'హెచ్‌డబ్ల్యూసీ'లలో దూరవాణి-వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. కాగా, 2019 నవంబరులో మొత్తం 22 రాష్ట్రాలు 'ఈ-సంజీవని ఏబీ-హెచ్‌డబ్ల్యూసీ' వేదికను ప్రారంభించాయి. ఈ డిజిటల్ నమూనా వినియోగంద్వారా ప్రత్యేక నిపుణులు-డాక్టర్ల ద్వారా దాదాపు 20 లక్షల మంది రోగులకు ఆరోగ్య సేవలు లభించాయి. ఈ సేవలకు సంబంధించి మొత్తం 21,000 మంది ప్రత్యేక నిపుణులు, వైద్యులు, సామాజిక ఆరోగ్యాధికారులకు 'ఈ-సంజీవని ఏబీ- హెచ్‌డబ్ల్యూసీ' వేదికద్వారా శిక్షణ ఇవ్వబడింది.

ఈ జాతీయ దూరవాణి-వైద్యసేవలో రెండోరకం 'ఈ-సంజీవని ఓపీడీ' కాగా, ఈ ఉచిత సేవ ప్రస్తుతం 28 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతోంది. తదనుగుణంగా 'ఈ-సంజీవని ఓపీడీ' కింద 350 అవుట్ పేషెంట్ విభాగాలు ఏర్పాటు కాగా, వీటిలో 300 ప్రత్యేక నిపుణుల 'ఓపీడీ'లు ఉన్నాయి. 'ఈ-సంజీవని ఓపీడీ' ద్వారా నేటివరకూ 30,00,000 మందికిపైగా రోగులు సేవలు అందుకున్నారు. సదరు డిజిటల్ ఆరోగ్య కార్యక్రమం ద్వారా పౌరులకు వారి ఇళ్లవద్దనే సేవలు అందుబాటులోకి వచ్చాయి.

మహమ్మారి వ్యాప్తి ఆరంభమైనప్పటి నుంచి కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అందిస్తున్న జాతీయ దూరవాణి-వైద్యసేవను సద్వినియోగం చేసుకోవడంలో అటు రోగులు, ఇటు వైద్యుల నుంచి విశేష సత్వర, విస్తృత స్పందన లభించింది. తద్వారా దేశంలో ఇప్పటికే విపరీత భారం మోస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవాప్రదాన వ్యవస్థకు 'ఈ-సంజీవని' ఒక సమాంతర ఆరోగ్య వ్యవస్థగా పనిచేస్తోంది. నిరుడు ఏప్రిల్ నెలలో 'ఈ-సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించినపుడు కోవిడేతర ఆరోగ్య సేవలందించే విధానంగానే పరిగణించబడింది. కానీ, సదరు ఎలక్ట్రానిక్ ఆరోగ్యసేవ అనువర్తనంతో లభ్యమయ్యే ప్రయోజనాల దృష్ట్యా వివిధ రాష్ట్రాలు సత్వరం దీన్ని అందిపుచ్చుకున్నాయి. తదనుగుణంగా కోవిడ్-19 సంబంధిత ఆరోగ్య సేవలను కూడా అందించేందుకు 'ఈ-సంజీవని' కార్యక్రమం కింద వివిధ ప్రక్రియలు, కార్యకలాపాల ప్రణాళికను రూపొందించాయి. ఈ ప్రణాళిక మేరకు గృహనిర్బంధ చికిత్స పొందుతున్న కోవిడ్-19 రోగుల పర్యవేక్షణ, యాజమాన్యం కోసం ఆయా రాష్ట్రాలు 'ఓపీడీ'లను ఏర్పాటు చేసుకున్నాయి.

ఏకాంత గృహవాస ప్రత్యేక ఓపీడీ సేవల దిశగా కొన్ని రాష్ట్రాలు కృషి చేస్తున్నాయి. ఈ మేరకు చివరి ఏడాది వైద్య విద్యార్థులద్వారా సుదూర విధానంలో రోగులకు కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని యోచిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కేసుల భారం పెరుగుతున్నందున 'ఈ-సంజీవని ఓపీడీ'ని 24 గంటలూ వినియోగిస్తున్నాయి. ఈ క్రమంలో 'ఈ-సంజీవని' వినియోగం ద్వారా రికార్డు స్థాయిలో 10 లక్షల సంప్రదింపు సేవలందించిన తమిళనాడు అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ప్రజలకు సేవలు అందించడం కోసం కేంద్ర రక్షణ శాక కూడా సాయుధ బలగాల వైద్యసేవలకు చెందిన అనుభవజ్ఞులను కూడా రంగంలో దింపింది.

ఇక 'ఈ-సంజీవని' సృష్టికర్తలు ప్రస్తుతం మొహాలీలోని 'సి-డాక్' కేంద్రంలో 'ఈ-సంజీవని ఓపీడీ' విశేషతకు మరో వినూత్న విశేషతను జోడించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే 'ఈ-సంజీవని ఓపీడీ' వేదికనుంచే 'జాతీయ ఓపీడీల' నిర్వహణ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చే వీలుంది. తద్వారా దేశంలోని ఏ ప్రాంతంలోగల పౌరులకైనా వైద్యులు సుదూర ఆరోగ్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు, వైద్యుల సంఖ్యలో అసమతౌల్యం, కొరత వంటి సవాళ్లను పరిష్కరించడంలో ఈ వినూత్న ఆవిష్కరణ తోడ్పడనుంది. 'ఈ-సంజీవని' అమలు చేస్తున్న (సంప్రదింపుల సంఖ్య దృష్ట్యా) అగ్రస్థానంలోని 10 రాష్ట్రాల జాబితా ఇలా ఉంది: తమిళనాడు (1044446), కర్ణాటక (936658), ఉత్తర ప్రదేశ్ (842643), ఆంధ్రప్రదేశ్ (835432), మధ్యప్రదేశ్ (250135), గుజరాత్ (240422), బీహార్ (153957), కేరళ (127562), మహారాష్ట్ర (127550), ఉత్తరాఖండ్ (103126).

# సీఎం సహాయనిధికి భారీ విరాళాలు.. కోటి రూపాయలు విరాళం అందించిన సౌందర్య




చెన్నై, మే 14: కరోనా వైరస్ ఉధృతంగా ఉన్న నేపథ్యంలో పేద ప్రజలకు అండగా నిలిచేందుకు పలువురు ప్రముఖులు సీఎం సహాయనిధికి భారీగా విరాళాలు అందిస్తున్నారు. ఇప్పటికే అనేక సినీ ప్రముఖులు విరాళాలు అందచేశారు. తొలుత హీరో సూర్య కుటుంబం కోటి రూపాయల విరాళం ఇచ్చింది. అలాగే, హీరో ఉదయనిధి స్టాలిన్ కూడా రూ.25 లక్షలు ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 లక్షల విరాళం అందించారు. ప్రముఖ హీరో అజిత్ 25 లక్షల రూపాయలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేశారు.ఇక రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ తన భర్త విశాగన్ వనంగముడి, మామ ఎస్ఎస్ వనంగముడితో కలిసి తమిళనాడు సీఎం స్టాలిన్‌ను కలిసి కోటి రూపాయల విరాళం అందించారు. తమ ఫార్మా కంపెనీ అపెక్స్ లాబోరేటరీ తరపున ఈ విరాళం అందించినట్లు సౌందర్య పేర్కొంది. ఇదిలావుంటే, కరోనా కట్టడికి ఆయా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయి. పలు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ అమల్లో ఉండగా, మరికొన్ని చోట్ల కఠిన ఆంక్షలు అమలవుతున్నాయి. మరోవైపు, ఆక్సిజన్, మందులు, బెడ్‌ల కొరత వేధిస్తోంది. దీంతో పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చి తమకు చేతనైనంత సాయం అందిస్తున్నారు.

# ఘనంగా బసవేశ్వరుని జయంతి



సంగారెడ్డి మే 14: : బసవేశ్వరుని 888 జయంతి వేడుకలను సంగారెడ్డి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జైపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, అదనపు కలెక్టర్ రాజర్షి, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై బసవేశ్వరుడి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమాజంలో అహింస ద్వారా సమాజానికి మంచి మార్గాన్ని ఎన్నుకొని జీవించేలా బసవేశ్వడు బోధనలు చేశాడని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఉన్నతంగా జీవించేవిధంగా బసవేశ్వరుడు బరోసా కల్పించాడన్నారు. సమాజ హితం కోసం పాటుబడిన బసవేశ్వరుడి మార్గం అందరికి ఆచరణీయమన్నారు.



# మరో 12 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్ , మే 14: కరోనా మహమ్మారి ప్రభావం రైల్వేలపై భారీగా పడుతున్నది. దేశంలో పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో పలు రాష్ట్రాలు లాక్‌డౌన్, మరికొన్ని కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. ఈ క్రమంలో జనం ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. దీంతో రైళ్లలో ఆక్కుపెన్సీ తగ్గుతోంది. ఫలితంగా రైల్వేశాఖ పలు సర్వీసులను రద్దు చేస్తోంది. ఇప్పటికే రాజధాని, శతాబ్ది, దురంతో ఎక్స్‌ప్రెస్ సహా పెద్ద ఎత్తున రైళ్లు రద్దు చేసింది. తాజాగా దక్షిణ మధ్య రైల్వే 12 రైళ్లను రద్దు చేసింది. ఇందులో సరైన ఆక్కుపెన్సీ లేని కారణంగానే రద్దు చేస్తున్నట్లు పేర్కొంది.

**రద్దు చేసిన రైళ్లు ఇవే..**

విశాఖపట్నం-లింగంపల్లి స్పెషల్ రైలు (నం.12831) ఈ నెల 14 నుంచి 31 వరకు రద్దు

లింగంపల్లి - విశాఖపట్నం స్పెషల్ (02832) ఈ 15 నుంచి జూన్ 1 వరకు..

విశాఖపట్నం - కడప స్పెషల్ (07488) ఈ నెల 14 నుంచి జూన్ 1 వరకు..

కడప -విశాఖపట్నం స్పెషల్ (07487) ఈ నెల 15 నుంచి జూన్ 1 వరకు..

ముంబై సీఎస్టీ- ఆదిలాబాద్ స్పెషల్ (01141) ఈ నెల 17 నుంచి..

ఆదిలాబాద్ - ముంబై సీఎస్టీ స్పెషల్ (01142) ఈ నెల 18 నుంచి..

సోలాపూర్ - హస్సన్ స్పెషల్ (01311) ఈ నెల 13 నుంచి..

హస్సన్- సోలాపూర్ స్పెషల్ (01312) ఈ నెల 14 నుంచి..

శ్రీగంగానగర్ - నాందేడ్ రైలు (02486) ఈ నెల 15 నుంచి..

నాందేడ్ - శ్రీ గంగానగర్ ట్రైన్ (02485) ఈ నెల 17 నుంచి..

శ్రీగంగానగం1 నాందేడ్ వరకు రైలు (02440) ఈ నెల 14 నుంచి..

నాందేడ్ - శ్రీ గంగానగర్ స్పెషల్ (02439) ఈ నెల 16 నుంచి..

# రాష్ట్ర సరిహద్దులో బారులు తీరిన వాహనాలు



నల్లగొండ మే 14 : తెలంగాణ వ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్న విషయం తెలిసిందే. లాక్‌డౌన్‌ను పోలీసులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి వద్ద ఏపీ నుంచి తెలంగాణలోకి అనుమతి లేకుండా వస్తున్న వాహనాలను పోలీసులు ఆపేశారు. దీంతో అక్కడ కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. లాక్‌డౌన్ సడలింపు సమయంలోనూ అనుమతులు తప్పనిసరి అని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణలో ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే లాక్‌డౌన్ నుంచి సడలింపు ఉంది.

# కరోనా కట్టడి, రోగుల సౌకర్యానికి టాస్క్‌ఫోర్స్

## -విలేకరుల సమావేశంలో వెల్లడించిన మంత్రి గంగుల

## సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

కరీంనగర్, మే 14:కరీంనగర్ జిల్లాలోని అన్ని డయాగ్నోస్టిక్స్ సెంటర్లలో శుక్రవారం నుంచి 2 వేలకే సిటీస్కాన్ సౌలభ్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరోనా కట్టడికి గురువారం మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొవిడ్ నియంత్రణతోపాటు రోగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడం.. ఇదే సమయంలో అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ దవాఖానలపై కఠిన చర్యలు తీసుకోవడం, 2వేలకే సిటీస్కాన్, ఎమ్మార్పీ ధరలకే రెమ్‌డెసివిర్, కరోనా బాధితులు తమ సమస్యలు చెప్పుకోడానికి వీలుగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని సమావేశం తదుపరి ఏర్పాటుచేసిన విలేక రుల సమావేశంలో మంత్రి వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించి వారి సహకా రం డయాగ్నోస్టిక్స్ ఎంటర్ల నిర్వాహకులను కోరామని, ఆ మేరకు.. వారు 2 వేలకు సిటీస్కాన్ తీసేందుకు అంగీకరించారని తెలిపారు. ఒక వేల స్కాన్‌విత్ ఫిల్మ్ కావాలంటే అదనంగా 200 చెల్లిస్తే సరిపోతుందన్నారు. శుక్రవారం నుంచి సిటీస్కాన్‌కు 2వేలకు మించి వసూలు చేస్తే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల అవస్థలను, ఇబ్బందులను గుర్తించి సహకరించడానికి ముందుకొచ్చిన దయాగ్నోస్టిక్స్ సెంటర్ నిర్వాహకులకు మంత్రి గంగుల కృతజ్ఞతలు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ బృందాలు..

జిల్లాలో కరోనా కట్టడితో పాటు, రోగులకు కావాల్సిన అవసరాలు తీర్చేందుకు, ప్రైవేటు దవాఖానల్లో అధిక చార్జీలకు అడ్డుకట్ట వేసేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు మం త్రి తెలిపారు. మొదటి కమిటీలో మంత్రి అధ్యక్షతన, కలెక్టర్, పో లీసు కమిషనర్, జిల్లా వైద్యాధికారి, రెండో కమిటీలో మంత్రి అధ్యక్షతన జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఐదుగురు పీఆరోలు ఉంటారని చెప్పారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూపును ఏ ర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొవిడ్ బాధితులకు సాయం అం దించేందుకు గ్రూప్ నంబర్లను నేడు ప్రకటిస్తామని, ఈ గ్రూపు 24 గంటల పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు బెడ్స్ ఖాళీల వివరాలను రోజూ వెల్లడిస్తామన్నారు.

**ఎమ్మార్పీకే రెమ్‌డెసివిర్..**

రోగులకు ఎమ్మార్పీకే ధరలకే రెమ్‌డెసివిర్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేక విభాగం ద్వారా ఏ దవాఖానకు ఎన్ని రెమ్‌డెసివిర్, టోసిలిజుమాబ్, ఇతర అత్యవసర మందులు కేటాయించాం.. ఏ దవాఖానకు ఎంత ఆక్సిజన్ పోతుందనేది పర్యవేక్షించడమే కాకుండా.. వాటి ప్రస్తుత స్టాక్, ఎవరికి వాడారు వంటి వివరాలతో డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ దవాఖానలతో పాటు ప్రైవేటులోనూ రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్‌లకు ఎలాంటి కొరతా లేదని, ప్రభుత్వ దవాఖానల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నగరంలోని 31 ప్రైవేట్ దవాఖానలకు రెమిడెసివర్ ఇంజెక్షన్లు సరఫరా అవుతున్నాయని, ఆపద సమయంలో ప్రైవేటు దవాఖానల నిర్వాహకులు మానవత్వంతో వ్యవహరించాలన్నా రు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు దవాఖానలపై తక్షణమే చర్యలు తీసుకునేలా ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫీజులు, మందుల, బెడ్ల బ్లాక్ దందాలపై టా స్క్ ఫోర్స్ కమిటీ పర్యవేక్షణ చేస్తుందన్నారు. రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకే చికిత్స అందించాలని కోరామని, ఆ మేరకు వారు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు.

**కట్టడికి కఠిన నిబంధనలు**

కరోనా కట్టడికోసం ప్రస్తుతం లౌక్‌డౌన్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్నదని, ప్రజల అవసరాలు, ఇతర విషయాలను దృష్టిలో పె ట్టుకొని ఉదయం నాలుగు గంటల పాటు సడలింపులు ఇచ్చింద ని, అయితే ఆ సమయంలో కొవిడ్ నిబంధనలు పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కరీంనగర్‌లో 11, 523 ఆక్టివ్ కేసులకు 9, 911 మంది హోంఐసొలేషన్లో కోలుకుంటున్నారని, ఇప్పటి వరకు 776 బృందాలతో 2 లక్షల 60 వేల ఇండ్లలో జ్వర సర్వే పూర్తయిందని, లక్షణాలున్న దాదాపు ఆరు వేల మందికి కిట్లు అం దించి అవసరమైన మందులతో చికిత్స అందిస్తున్నామని, ఇప్పటికే 2,18,463 మందికి వాక్సినేషన్ పూర్తయిందని మంత్రి తెలిపారు. కరీంనగర్‌లో ఇండోనేషియా కేసులు పెరిగిన సమయంలో ప్రతి ప్రజాప్రతినిధి ఎలా పని చేశారో అదేవిధంగా ప్రస్తుతం మంత్రులు మొదలుకొని ఎమ్మెల్యేలు, మేయర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమష్టి కృషితో జిల్లాను కొవిడ్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ సునీల్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

# కుటుంబమే కదా సౌభాగ్యాల కోవెల..!

### (15 మే 'అంతర్జాతీయ కుటుంబ దినం' సందర్భంగా)

విశ్వ కుగ్రామానికి పునాదులు కుటుంబాలు. వసుదైక కుటుంబ సౌభాగ్యానికి మూలాలు కుటుంబాలు. అమ్మనాన్నలు మరియు కుటుంబం లేని నరుడున్నాడా ?కుటుంబం అంటే నాలుగు గోడల నడుమ ఉన్న గదులు కాదు. ప్రేమానురాగాల సిమెంటుతో కట్టిన అనురాగాల పొదరిల్లు. కుటుంబం అంటే నవ్వులు, అనుబంధాలు, ఆప్యాయతలు, బాధలు, బాధ్యతలు, హక్కులు, సంతోషాల కుప్పలు, గాయాలకు లేపనాలు, సవాళ్ళకు సమాధానాలు, శారీరక మానసిక వికాస సోపానాలు, కష్టసుఖాల సమతుల్యతలు, అమ్మ లాలనలు, నాన్న నిర్దేశాలు మరియు సమాజాభివృద్ధికి మూల స్తంభాలు. అనాదిగా కుటుంబాలు కాలక్రమంలో పెను మార్పులకు లోనవుతూ ఉన్నప్పటికీ కుటుంబానికి ప్రత్యామ్నాయం నేటికీ దొరకలేదు. ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తూ న్యూక్లియర్ ఫామిలీలు వెలుస్తున్నాయి. డిజిటల్ యుగంలో కుటుంబం అంటే అమ్మనాన్న మరియు ఒకరిద్దరు పిల్లలుగా కుచించుకు పోయింది. నాన్న నాయకత్వం, అమ్మ అమృత హస్తం నీడన ఎదిగిన పిల్లలు జాతిరత్నాలు అవుతారు. అమ్మనాన్ననలను గౌరవించిన పిల్లలు చరిత్ర హీనులు అవుతారు. ఆది గురువులుగా తల్లితండ్రులు పిల్లల మనసుల్లో మానవీయ విత్తులు నాటుతారు. సంతోషాలతో నిండిన గృహాలు దేశాభివృద్ధికి గీటురాళ్ళు. అస్థిర కుటుంబాలు అశాంతికి నెలవులు. సమాజ దేహానికి కుటుంబాలే అస్థిపంజర వ్యవస్థలు, కుటుంబ సభ్యులే అవయవాలు. ఇండియాలో ఆర్థిక స్థితిని బట్టి ధనిక, మధ్య తరగతి మరియు పేదరిక కుటుంబాలు ఉంటూ, పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ నెలకొని ఉన్నది.

ప్రపంచ మానవాళి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1994లో 'అంతర్జాతీయ కుటుంబ దినం (ఇంటర్నేషనల్ ఫ్యామిలి డే)'ను ప్రతి ఏటా 15 మే రోజున పాటించుటకు నిర్ణయం తీసుకుంది. సమాజానికి యూనిట్ కుటుంబమని, కుటుంబ అభివృద్ధే సమాజ అభివృద్ధిని నమ్మిన ఐరాస ప్రతి ఏటా ఒక ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవాన్ని జరుపుకొనుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కుటుంబ దినం – 2021 నినాదంగా 'సుస్థిరాభివృద్ధితో సామాజిక మార్పు – మానవాళి శ్రేయస్సులో డిజిటల్ టెక్నాలజీ పాత్ర' అనే అంశాన్ని తీసుకున్నారు. తల్లితండ్రులు తమ పిల్లల సమగ్రాభివృద్ధికి జీవితాలను ధార పోస్తారు. చిన్నారుల శారీరక మానసిక వికాసానికి కుటుంబ వాతావరణం దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అవిద్య, నిరుద్యోగాల వంటి సవాళ్ళను అధిగమించడానికి కుటుంబ వ్యక్తులు ప్రధాన కారకులు అవుతారు. కుటుంబ అభివృద్ధికి సాంఘీక, ఆర్థిక మరియు జనాభా లాంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. కుటుంబాన్ని పరిష్ట పరిచినపుడు సమాజం నెలకొన్న అన్ని సమస్యలు సమిసిపోతాయి. కుటుంబ సభ్యుల్లో అమ్మనాన్నల మధ్య జీవన బంధం, పిల్లలతో ప్రేమానురాగాల సంబంధం, పిల్లల మధ్య సోదర రక్తానుబంధాలు పటిష్టంగా నెలకొని ఉంటాయి. అంతర్జాతీయ కుటుంబ దినం వేదికగా వ్యక్తి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను వివరించడం, కుటుంబ సభ్యులు కలిసి ఆటపాటలతో సంతోషంగా గడపడం, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం లాంటివి పాటిస్తారు. సమాజాభివృద్ధికి కుటుంబమే సోపానంగా నిలుస్తుంది. కుటుంబ విచ్ఛిన్నంతో కుటుంబ సభ్యుల మనసులు విరిగినట్లు భావించాలి. ఉన్నత విలువలు మరియు సామాజిక సంఘీభావాలకు కుటుంబ వ్యవస్థ అతి ప్రధానమైనది. కుటుంబాల ప్రగతికి ప్రభుత్వాలు కూడా ప్రధాన భూమికను నిర్వహించాలి.

భారతీయ కుటుంబ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల సంస్కృతి ప్రధానమైనది. ఒకే కుటుంబంలో 3 – 4 తరాల సభ్యులైన తాతలు, బామ్మలు, బాబాయిలు, పిన్నులు, మనుమలు, మనుమరాండ్రు, సోదర సోదరీమణులు, బావలు, మరదులు లాంటి సమీప సంబంధీకులు ఒకే గొడుగు కింద కుటుంబ సభ్యులుగా జీవించగలగడం ఓ అపురూప భావన. మన దేశ కుటుంబ వ్యవస్థలో కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ ఫామిలీలు మరియు సరళ కుటుంబాలు భాగమై ఉన్నాయి. వీటికి తోడు నేటి ఆధునిక యుగంలో సింగిల్ పేరెంట్ కుటుంబాలు, పిల్లలు లేని కుటుంబాలు లాంటి విపరీత వ్యవస్థలు కూడా రావడం విచారకరం. భారతీయ సగటు కుటుంబంలో 4 – 5 (కుటుంబ పరిమాణం 4.6) సభ్యులు ఉంటున్నారు. మన కుటుంబ పునాదులుగా విధేయత, నైతిక సమగ్రత మరియు ఐక్యత గుర్తించబడినవి. భారతదేశంలోని దాదాపు 138 కోట్ల జనాభా 25 కోట్ల కుటుంబాలలోజీవిస్తూ ఉన్నారని అంచనా. వీటిలో 20 కోట్లు హిందూ, 3 కోట్ల ముస్లిమ్, 6.3 మిలియన్ల క్రిస్టియన్, 4.1 మిలియన్ల సిక్కు మరియు 1.9 మిలియన్ల జైన మరియు ఇతర మతాలకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. భారత్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విద్య, మహిళాసాధికారత, పాశ్చాత్య ధోరిణి, వివాహ వ్యవస్థలో మార్పులు, సామాజిక విలువల్లో మార్పులు, వ్యవసాయ మరియు గ్రామీణ పరిశ్రమలు తగ్గడం లాంటి ప్రధాన కారణాలతో కుటుంబ వ్యవస్థల్లో పెను మార్పులు వస్తున్నాయి. స్వల్ప విభేదాలతో విడిపోవడంతో సింగిల్ ఫాదర్ లేదా సింగిల్ మదర్‌లతో పిల్లలు ఎదగడంతో భారతీయ కుటుంబ వ్యవస్థ పరిహాసం పాలు అవుతున్నది. నేటి పిల్లలే రేపటి తల్లితండ్రులని మరువరాదు. న్యూక్లియర్ మరియు సింగిల్ పేరెంట్ కుటుంబాలు పెరుగుతున్న డిజిటల్ కాలంలో పిల్లలకు సామాజిక అనగాహన మరియు పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం అందడం లేదు. నేటి పిల్లల్లో పేరెంట్స్ పట్ల నిర్లక్ష్యం, చులకన భావం పెరిగి, అనేక దురలవాట్ల నడుమ సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదకర దుస్థితిలో భారత సమాజం ఉన్నది. కుటుంబాలను సౌభాగ్య కోవెలలుగా, అమ్మనాన్నల్ని ఆది దేవతలుగా భావిస్తూ, ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తూ భరతమాత నుదుట సంతోష తిలకం దిద్దుదాం. కుటుంబ విలువలకు కలకాలం పట్టం కడదాం. గృహాన్ని స్వర్గసీమగా మలుచుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



## కొవిడ్-19 బాధిత జర్నలిస్టులకు ఉచిత వైద్యం

భోపాల్ మే 14: అక్రిడేషన్ ఉన్నా లేకున్నా కొవిడ్-19 బారిన పడిన జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య అందించనున్నట్లు మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం తెలిపారు. ఈ వారం ప్రారంభంలోనే చౌహాన్ జర్నలిస్టులను కరోనా వారియర్స్ ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే. జర్నలిస్టులు వారి విధులను నిర్వర్తించే క్రమంలో కొవిడ్ బారిన పడటం, దురదృష్టవశాత్తు కొందరు చనిపోవడం ఇటీవల మనం చూసిందేనని ఓ ప్రకటనలో సీఎం తెలిపారు.

అయితే నేటి నుంచి అక్రిడేటెడ్, నాన్ అక్రిడేటెడ్ జర్నలిస్టులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలో పనిచేస్తున్నవారు కొవిడ్‌కు గురైతే వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం చెప్పారు. ఈ చర్య జర్నలిస్టులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో సహాయపడుతుందని అదేవిధంగా వారి మెరుగైన చికిత్సను కూడా నిర్ధారిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## సమానత్వం బసవన్న తత్త్వం!



పాలకుర్తి, మే 14: సకల జనుల సమానత్వమే బసవన్న తత్త్వం అని తెలంగాణ అర్చక ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ దేవగిరి వెంకట రాజేశ్వర శర్మ పేర్కొన్నారు. సోమనాథ కళాపీఠం అధ్వర్యంలో పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం విశ్వగురు బసవ 888వ జయంతి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జరిగింది.

డాక్టర్ రాపోలు సత్యనారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా డి వి ఆర్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసారు. బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం శర్మ మాట్లాడారు.

బసవన్న ప్రబోధించిన కాయక, దాసోహ సుగుణాలు నీతివంతమైన సమాజనిర్మాణానికి దోహదపడుతాయని ఆయన అభివర్ణించారు. విశిష్ట అతిథి ప్రధానార్చకులు దేవగిరి రామన్న లింగార్చన అధికారాన్ని అందరికి అందించిన సంస్కర్త బసవన్న అని కొనియాడారు. బసవపురాణం వ్రాసిన మహాకవి పాలకురికి సోమనాథుని జన్మస్థలాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు, పంచాయతిరాజ్ మంత్రి దయాకర రావు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈ ఓ వీరస్వామి, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చక బృందం దేవగిరి లక్ష్మన్న, అనిల్ కుమార్, నాగరాజు, సంతోష్, శ్యాం, సిబ్బంది బండారి శ్రీనివాసులు, నవీన్, సైదమ్మ, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు బక్కెర సిద్దయ్య, పాలకుర్తి మండల గౌరవ అధ్యక్షుడు బక్కెర రవి, సోమనాథ కళాపీఠం గౌరవ సలహాదారు వి వెంకటేశ్వర రావు, అధ్యక్షురాలు రాపోలు శోభారాణి, కోశాధికారి ఇమ్మడి దామోదర్, మామిండ్ల రమేశ్ రాజా, గూడూరు లెనిన్, మేరుగు మధుసూదన్, రాపోలు సోం సాయి, గజ్జి సంతోష్, చిక్కమఠం పర్వతయ్య, భరత్, జి నరేందర్ రెడ్డి, పుట్ట అంజనేయులు, ఇప్పకాయల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## పాజిటివ్ వస్తే ఆందోళన వద్దు : ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి మే 14: జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తనిఖీ చేశారు. కరోనా బాధితులకు అందిస్తున్న వైద్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెస్టుల్లో కరోనా పాజిటివ్ వస్తే ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు. డాక్టర్ల సూచనలు పాటిస్తూ ధైర్యంగా ఉండాలన్నారు. మనసిక బలమే కరోనాకు అసలైన మందు అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## నిబంధనల మేరకు రంజాన్ పండుగ జరుపుకోవాలి



ఖమ్మం మే 14: : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నివాసంలో కొద్దిమంది ముస్లిం పెద్దలతో కొవిడ్ నిబంధనలు పాటిస్తూ వారితో పాటు మంత్రి నమాజ్ చేశారు. నెల రోజుల పాటు అత్యంత నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేస్తూ ప్రపంచ బాగు కోసం అల్లాను ప్రార్థించిన ప్రతి ముస్లిం సోదర, సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు.

మైనారిటీలు ఆత్మగౌరవంతో తల ఎత్తుకునేలా సీఎం కేసీఆర్ బాటలు వేశారన్నారు. పర్వదిన సంబురాలను ముస్లిం సోదరులు కరోనా నిబంధనల ప్రకారంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## కరోనా కట్టడికి పకడ్బందీ చర్యలు : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ మే 14: కరోనా కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి వంచనలేకుండా పనిచేస్తుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన మంత్రి మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్, కోవిడ్ వార్డును సందర్శించారు. రోగులను పరామర్శించారు. వారికి మనో ధైర్యం కల్పించారు. హాస్పిటల్‌లో వసతులు కల్పిస్తున్న తీరును, వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో కరోనా బారిన పడకుండా సరైన నియంత్రణ చర్యలు పాటించేందుకు, జిల్లా స్థాయిలో ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ వేశామని తెలిపారు. గ్రామాల్లో 750 టీమ్ లు పెట్టి పర్యవేక్షణ చేయిస్తున్నామన్నారు.

ఇంటింటికి ఈ టీమ్ లు వెళ్లి లక్షణాలు ఉన్న వారిని గుర్తించిన వెంటనే వారికి కావాల్సిన మందులు, మనో ధైర్యాన్ని అందిస్తాయన్నారు. హాస్పిటల్ కు వచ్చిన కరోనా రోగులకు సరైన సమయంలో సరైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు హాస్పిటల్లో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఈ కొవిడ్ కష్టకాలంలో రంజాన్ పండుగ నిర్వహించుకుంటున్న ముస్లింలకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా వైరస్ బారిన పడి ఇబ్బందులు పడకుండా, ఇళ్లలోనే ఉండి ప్రార్థనలు జరుపుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రాములు, కొవిడ్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సతీష్ రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పుత్నిక్ వి వ్యాక్సిన్ డోసు ధర రూ.995

హైదరాబాద్ , మే 14: రష్యాకు చెందిన స్పుత్నిక వి వ్యాక్సిన్ డోసు ధరను రూ.995.40గా నిర్ణయించినట్లు శుక్రవారం వెల్లడించింది డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న టీకాలకు ఈ ధర ఉంటుందని, ఇండియాలో తయారయ్యే వాటికి తక్కువ ధర ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే హైదరాబాద్‌లో ల్యాండైన ఈ టీకా ఎమ్మార్పీని రూ.948గా నిర్ణయించగా.. దానికి 5 శాతం జీఎస్టీ కలిపితే ధర రూ.995.40 అవుతుంది. ఈ టీకా తొలి డోసును ఇప్పటికే హైదరాబాద్ వ్యక్తికి వేసినట్లు రెడ్డీస్ ల్యాబ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 1వ తేదీనే లక్షన్నర స్పుత్నిక్ వి టీకాలు హైదరాబాద్‌లో దిగిన విషయం తెలిసిందే. వచ్చే కొద్ది నెలల్లో మరిన్ని డోసులు దిగుమతి అవుతాయని, త్వరలోనే ఇండియాలోనూ ఈ వ్యాక్సిన్ తయారీ ప్రారంభిస్తామని చెప్పింది.

## ఈదుల్ ఫితర్ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన- ఆది



రాజన్న సిరిసిల్ల మే, 14(నేటినిజం ప్రతినిధి): రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్ ) నేడు శుక్రవారం జరుపుకునే సందర్భంగా ముస్లింలకు కాంగ్రెస్ నేత శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారుగంగాజమునా తహజీబ్ జీవన విధానం మరింతగా పరిఢవిల్లాలని, సోదరభావ స్ఫూర్తి గొప్పగా బలపడాలని అభిలషించారు. కొవిడ్ నిబంధనలను అనుసరిస్తూ ప్రార్థనలు చేసుకోవాల్సిందిగా కోరారుకరోనా మళ్లీ విజృంభిస్తోన్న వేళ ప్రభుత్వం జారీ చేసిన కొవిడ్ నిబంధనలను అనుసరించి తెలిపారు ఇంట్లోనే ప్రార్థనలు చేసుకోవాల్సిందిగాఅలాగే ఎవరి ఇంట్లోవారే కుటుంబసభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవాలని కోరారు .త్వరగా కరోనా మహమ్మారి పారదోలాలని అల్లాను ప్రార్థించాలని కోరారు

## తప్పనిసరి మాస్క్ నిబంధన ఎత్తివేసిన అమెరికా..

వాషింగ్టన్ మే 14: కరోనా టీకాలు వేసుకున్న వ్యక్తులు మాస్క్‌లు ధరించాల్సిన అవసరం లేదని అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకటించింది. రెండు డోసులు టీకా తీసుకున్న వారు ఎలాంటి ఆంక్షలు లేకుండా తమ కార్యకలాపాలు కొనసాగించవచ్చని చెప్పింది. కరోనా ఆంక్షలు సడలించాలని అధ్యక్షుడు జోబైడెన్ సీడీసీని కోరారు. పూర్తిస్థాయిలో వ్యాక్సిన్ వేయించుకున్న వారి పట్ల కొవిడ్ ఆంక్షలు సడలించాలని బైడెన్ ప్రభుత్వంపై ఒత్తిడి నేపథ్యంలో సీడీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రజలను కొవిడ్ పరిస్థితుల నుంచి తిరిగి సాధారణ జీవనానికి తీసుకెళ్లేందుకు సీడీసీ కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసింది.

ఈ మేరకు శ్వేతసౌధంలోని సీడీసీ డైరెక్టర్ డాక్టర్ రోషెల్ వాలెన్స్కీ మార్గదర్శకాలు విడుదల చేశారు. కొవిడ్-19 రెండు డోసుల వ్యాక్సిన్ వేయించుకున్న వ్యక్తులు.. పని ప్రదేశాలు, పాఠశాలల్లో మాస్క్ లేకుండా తిరిగేందుకు అనుమతించింది. అయితే, జనసంద్రం ఉన్న ప్రాంతాలు, బస్సులు, విమానాలు, దవాఖానాలు లాంటి ప్రాంతాల్లో మాత్రం మాస్క్‌లు ధరించడం తప్పనిసరని సీడీసీ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. మాస్క్ నిబంధనలు సడలించడంపై అధ్యక్షుడు జోబైడెన్ హర్షం వ్యక్తం చేశారు. ఇదో గొప్ప మైలురాయి, గొప్ప రోజన్నారు. చాలా మంది అమెరిక్లకు వేగంగా టీకాలు వేయడంలో సాధించిన అసాధారణ విజయం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

## పిడుగా.. విష ప్రయోగమా

# 18 ఏనుగుల మృతిపై పోస్టుమార్టమ్



గౌహతివే 14: : సెంట్రల్ అస్సాంలోని నగావ్ జిల్లాలో గురువారం దారుణం జరిగిన విషయం తెలిసిందే. 18 ఏనుగులు ఒకేసారి మృతిచెందిన ఆ ఘటన అందర్నీ కలిచివేసింది. భారీ మూగజీవాలు ఎలా ఒకేసారి ప్రాణం విడిచాయన్నదే అంతు చిక్కని ప్రశ్న. గజరాజుల మరణంపై అస్సాం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసింది. అయితే ఇవాళ ఆ ఏనుగులు మృతిచెందిన ప్రాంతాన్ని ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి పరిమల్ శుక్లబైద్య విజిట్ చేశారు. ఏనుగులు మృతిచెందిన బాముని పర్వతాలకు వెళ్లిన మంత్రి.. అక్కడ ఆ జీవాలకు నివాళి అర్పించారు. అటవీశాఖ అధికారితో పాటు కొందరు వెటర్నరీ బృందం .. ఈ ఘటన పట్ల విచారణ చేపడుతుందన్నారు. మూడు రోజుల్లోనే ప్రిలిమినరీ ఇంక్వైరీ నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పూర్తి స్థాయి విచారణతో కూడిన నివేదికను మరో 15 రోజుల్లోగా సమర్పించాలన్నారు. తీవ్ర విషాదాన్ని మిగిల్చిన 18 ఏనుగుల మృతికి అసలైన కారణాలను అన్వేషిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

బాముని పర్వత శ్రేణుల్లో 18 ఏనుగులు అనుమానస్పద రీతిలో మత్యువాతపడ్డాయి. బరహంపూర్ పోలీసుల ప్రకారం.. నాలుగు ఏనుగులు పర్వత శ్రేణుల మొదటల్లో.. మిగితా ఏనుగుల మృతదేహాలన్నీ పర్వతశిఖరాలపై పడి ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం తమకు ఏనుగుల మృతిపై సమాచారం అందినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. స్థానిక గ్రామస్థులు తమకు ఆ సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ ఏనుగులు ఎలా మృతిచెందాయో అధికారులు తేల్చలేకపోయారు. మెరుపులు, పిడుగు పాటు వల్ల ఏనుగులు మృతిచెంది ఉంటాయని ఫారెస్ట్ అధికారులు అనుమానిస్తున్నారు.

ఘటనా ప్రాంతానికి వెళ్లిన పోలీసులు ఇవాళ పోస్టు మార్టమ్ ప్రారంభించారు. పోస్టు మార్టమ్ చేయకుండా కేవలం పిడుగుల వల్ల ఏనుగులు మృతిచెందినట్లు తేల్చలేమని నిపుణులు తెలిపారు. పోస్టుమార్టమ్‌లోనే మొత్తం వివరాలు బయటపడుతాయని తెలుస్తోంది. కానీ ప్రాథమికంగా ఈ ఘటన మాత్రం పిడుగుల వల్ల కాదు అని ఏనుగుల నిపుణుడు విజయానంద్ చౌదరీ తెలిపారు. విష ప్రయోగం వల్లే ఆ ఏనుగులు మృతిచెంది ఉంటాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఒకవేళ ఇది విషప్రయోగమే అయితే ఆ మూగ జీవాలను ఎందుకు టార్గెట్ చేశారో తెలియాల్సి ఉంటుంది. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో దేశంలో ఏనుగులు మృతిచెందిన ఘటన చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి.

## గూగుల్‌తో జతకట్టిన ఎలోన్ మస్క్ 'స్టార్‌లింక్'

హైదరాబాద్ , మే 14: గూగుల్‌తో స్పేస్‌ఎక్స్ సంస్థ వ్యవస్థాపకుడు ఎలోన్ మస్క్ జతకట్టారు. వీరి కలయికతో ఇప్పుడు ఉపగ్రహానికి హై స్పీడ్ ఇంటర్నెట్, సురక్షిత కనెక్షన్ లభించే అవకాశాలు ఉన్నాయి. రానున్న కొన్ని రోజుల్లో భారత్‌లో రిలయన్స్ సంస్థకు ప్రధాన పోటీదారుగా అవతరిస్తుందని నిపుణులు అంటున్నారు.

ఎలోన్ మస్క్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా సీఈఓగా ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధనవంతుడు. అతని శాటిలైట్-టు-ఇంటర్నెట్ సేవా సంస్థ స్పేస్‌ఎక్స్.. దీనిని 'స్టార్‌లింక్' అని పిలుస్తారు. స్టార్‌లింక్ ఫిబ్రవరిలోనే భారతదేశంలో హై-స్పీడ్ ఇంటర్నెట్ సర్వీస్ 'స్టార్‌లింక్' కోసం ప్రీ-బుకింగ్ ప్రారంభించింది. ఇప్పుడు ఈ పనిచేయడానికి గూగుల్‌తో చేయి కలిపింది. ఈ భాగస్వామ్యం ఎలోన్ మస్క్ పనులను వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. స్టార్‌లింక్ ప్రపంచంలోని ఏ మూలనైనా ఇంటర్నెట్ సేవలను అందించడం సులభం చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా స్టార్‌లింక్‌లో 10,000 మందికి పైగా యాక్టివ్ యూజర్లు ఉన్నారని కంపెనీ పేర్కొన్నది.

గూగుల్ అధిక సామర్థ్యం గల ప్రైవేట్ నెట్‌వర్క్ స్టార్‌లింక్ గ్లోబల్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు మద్దతు ఇస్తుంది. దీని ద్వారా వినియోగదారులు ఎలాంటి అంతరాయం లేకుండా అధిక వేగంతో ఇంటర్నెట్ పొందుతారు. గూగుల్ క్లౌడ్ కక్ష్యలో 1500 స్టార్‌లింక్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు.

భూమికి దగ్గరగా ఉన్నది ఇదొక్కటే

కరోనా నేపథ్యంలో ఎక్కువ మంది ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేస్తుండటం, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతుండటంతో ఇంటర్నెట్ స్పీడ్ చాలా ప్రాముఖ్యత సంతరించుకున్నది. ఎవరు నాణ్యత గల సేవలందిస్తే వారి సంస్థకు వినియోగదారులు మారుతున్నారు. ఇలాంటి సమయంలో స్టార్‌లింక్ ఉపగ్రహం ఇతర ఉపగ్రహాల కంటే భూమికి 60 రెట్లు దగ్గరగా ఉన్నదని, ఫలితంగా అన్నిటికన్నా ఎక్కువ వేగంతో ఇంటర్నెట్ అందుతుందని స్పేస్‌ఎక్స్ సోషల్ మీడియాలో రాసింది.

ఫిబ్రవరి నుంచి ప్రీ బుకింగ్

స్టార్‌లింక్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన సమాచారం ప్రకారం, స్టార్లింక్ ఇంటర్నెట్ 2022 సంవత్సరంలో భారతదేశంలో ప్రారంభమవుతుంది. వచ్చే ఫిబ్రవరి నుంచి భారతదేశంలో ప్రీ-బుకింగ్ మొదలవుతుంది. ప్రస్తుతం సేవా పరీక్షలు నడుస్తున్నాయి. ముందస్తు ఆర్డర్ సమయంలో ఈ సేవ ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను కవర్ చేస్తుంది.

స్టార్‌లింక్ ప్రాజెక్టు కోసం స్పేస్‌ఎక్స్ ఇప్పటికే వెయ్యికి పైగా ఉపగ్రహాలను ప్రయోగించింది. ప్రస్తుతం స్టార్లింక్ 50?150 ఎంబీపీఎస్ వరకు ఇంటర్నెట్ వేగాన్ని అందిస్తుంది. 1 జీబీపీఎస్ వరకు వేగవంతం చేయడానికి భవిష్యత్‌లో 12 వేల ఉపగ్రహాల నెట్‌వర్క్‌ను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎలోన్ మస్క్ చెప్పారు. స్టార్‌లింక్ సేవలు ఉన్నతంగా ఉన్నట్లయితే రానున్న కొన్ని రోజుల్లోనే రిలయన్స్‌కు ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. రిలయన్స్‌కు ఇప్పుడు 65 మిలియన్ల వినియోగదారులు ఉన్నారు. వీరి సేవలు గ్రామీణ ప్రాంతాల్లో చాలా అధ్వాన్నంగా ఉండటంతో ఎలోన్ మస్క్ సంస్థ పైచేయి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి.

## ప్రళయం వస్తున్నా ఓ మొక్క నాటండి

హైదరాబాద్ , మే 14: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రళయం వస్తున్న సమయంలో కూడా మీ చేతిలో ఒక మొక్క ఉంటే దాన్ని నాటండి అని చెప్పిన మహమ్మద్ ప్రవక్త సూక్తిని ఈ సందర్భంగా ఎంపీ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

ఎంపీ సంతోష్ కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

సినీ, రాజకీయ, వ్యాపార, తదితర వర్గాల ప్రజలు పర్యావరణ హితానికి తమ వంతుగా మొక్కలు నాటుతూ ఇతరులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారు.

## కరోనాను జయించిన మంత్రి కొప్పుల దంపతులు

హైదరాబాద్ , మే 14:కొవిడ్ బారిన పడిన మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు కరోనాను జయించారు.

ఈ నెల 6 తేదీన మంత్రి సతీమణి స్నేహలతకు పాజిటివ్ నిర్ధారణ కాగా 9వ తేదీన మంత్రి కొప్పులకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరారు. చికిత్స పొందిన అనంతరం ఈశ్వర్ దంపతులు శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారు.

వైద్యుల సలహా మేరకు మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తన నివాసంలో హోం ఐసోలేషన్‌లో ఉంటున్నట్లు మంత్రి తెలిపారు. కరోనా మహమ్మారిని జయించడానికి నాకు ధైర్యం ఇచ్చింది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులే అని మంత్రి తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com